Follow: @ANNTELUGU
05-08-2026
ANN తెలుగు
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 213 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## పకడ్బందీగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

- పరీక్షల నిర్వహణపై ప్రత్యేక నిఘా
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్, మహా : పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7437 పోస్టుల భర్తీ ప్రక్రియపై నిఘా వర్గాలు ముఖ్యమంత్రికి కీలక సమాచారం అందించాయి. నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్ తో పాటు పోలీస్

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

### హరీశ్‌పై మహేశ్ ఆరోపణలు

- క్షుద్ర పూజలంటూ సంచలన వ్యాఖ్యలు.
- కరువు కోసమే పూజలు చేశారన్న ఆరోపణ



02

### వల్గర్ నిధి

- త్రిషపై డబుల్ మీనింగ్ వ్యాఖ్యలు.. అరెస్ట్
- తమిళ నాడులో ఉద్రిక్తత.. బెయిల్ పై రిలీజ్



02

### ట్రంప్ టారిఫ్‌లకు ఎదురుదెబ్బ

- కోర్టుకెక్కిన 25 అమెరికా రాష్ట్రాలు



02

## రూ.400 కోట్ల ఆదా లక్ష్యం

టీ-ఫైబర్‌తో ప్రభుత్వంలో డిజిటల్ విప్లవం

- సెప్టెంబర్ 1 నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు ప్రైవేట్ ఇంటర్నెట్‌కు గుడ్‌బై
- టీ-ఫైబర్ ద్వారానే అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు నెట్ సేవలు
- ఇంటింటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ లక్ష్యంగా వేగవంతమైన చర్యలు
- ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్

02





### ప్రతీ గింజకూ లెక్క చెప్పాల్సిందే

- నిజాయితీగల రైస్ మిల్లర్లకు సంపూర్ణ సహకారం
- పెండింగ్ సీఎంఆర్ బకాయిలను మిల్లులవారీగా సమీక్షిస్తాం
- రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు
- రైతుల ధాన్యం కొనుగోలు, కనీస మద్దతు ధర చెల్లింపులకు ఎలాంటి ఆటంకం ఉండదు
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

02



### ఢిల్లీకి సీఎం రేవంత్

- నేడు కేంద్ర మంత్రులతో భేటీలు
- 17 నుంచి విదేశీ పర్యటనలు.

02



### విద్యుత్ ఛార్జీలు పెంచలేదు, ట్రూడౌన్ చేశాం

- మంత్రి గొట్టిపాటి
- అస్తవ్యస్తమైన విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టాం

02

### జనగళానికి జైకొట్టిన సర్కార్

- ప్రజా పాలనలో సరికొత్త విప్లవం.
- ఇక మీ ఊరిలోనే ప్రజావాణి!

04



# ప్రతీ గింజకూ లెక్క చెప్పాల్సిందే

**హైదరాబాద్, మహా :** రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం, ప్రజాధనంతో కొనుగోలు చేసిన ప్రతి ధాన్యం గింజకూ లెక్క తేల్చడం, కస్టమ్ మిల్లింగ్ వ్యవస్థలో పూర్తి పారదర్శకతను తీసుకురావడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, ఆహార-పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వానికి చెందిన ధాన్యం, బియ్యం నిల్వలను దారి మళ్లించడం, దుర్వినియోగం చేయడం, సీఎంఆర్ బకాయిలను సకాలంలో చెల్లించకుండా ప్రజాధనానికి నష్టం కలిగించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ధాన్యం సేకరణ, నిల్వలు, కస్టమ్ మిల్లింగ్, ప్రభుత్వానికి బియ్యం అప్పగింత, బకాయిల వసూలు, ప్రభుత్వ నిల్వల పరిరక్షణతో పాటు డిఫాల్టర్ రైస్ మిల్లులపై తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలపై సోమవారం సాయంత్రం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో పౌరసరఫరాల శాఖాధికారులు పాల్గొనాలని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు నుంచి ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగించే వరకు మొత్తం వ్యవస్థలోని ప్రతి దశను సమగ్రంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష రైస్ మిల్లింగ్ పరిశ్రమ మొత్తానికి వ్యతిరేకంగా చేపట్టిన చర్య కాదని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. తెలంగాణలో వందలాది మంది రైస్ మిల్లర్లు దశాబ్దాలుగా ప్రభుత్వంతో నిజాయితీగా పనిచేస్తూ రాష్ట్ర వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు, ప్రజాపంపిణీ వ్యవస్థకు విశేషంగా సహకరిస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు అనుగుణంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నిజాయితీగల మిల్లర్లకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. కొంతమంది మిల్లర్లు ప్రభుత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని దుర్వినియోగం చేస్తూ అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ ధాన్యం, బియ్యం నిల్వలను దారి మళ్లించడం, నిర్ణీత సమయంలో కస్టమ్ మిల్లింగ్ బియ్యం అప్పగించకపోవడం వంటి అక్రమాలకు పాల్పడ్డారని మంత్రి తెలిపారు. ఇటువంటి చర్యలతో రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందని, అంతిమంగా ఆ భారం తెలంగాణ ప్రజలపైనే పడుతోందన్నారు.

**భారీ కొనుగోలు వ్యవస్థ**

దేశంలో అత్యధికంగా వరి సాగు, ధాన్యం సేకరణ జరుగుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి వానాకాలం, యాసంగి సీజన్‌లో రైతులు దళారుల చేతిలో నష్టపోకుండా, కనీస మద్దతు ధర పొందేలా ప్రభుత్వం దేశంలోనే అతిపెద్ద ధాన్యం కొనుగోలు కార్యక్రమాల్లో ఒకదాన్ని నిర్వహిస్తోందన్నారు.

రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యాన్ని తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేస్తోందని తెలిపారు. సాధారణంగా 48 గంటల్లోనే ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ హామీతో బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయలు రుణంగా సమీకరించి ఈ కొనుగోలు ప్రక్రియను నిర్వహిస్తున్నామని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ విధానంలో రైస్ మిల్లులకు అప్పగిస్తామని, మిల్లర్లు నిర్ణీత నిష్పత్తిలో ధాన్యాన్ని బియ్యంగా మార్చి తిరిగి ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుందని తెలిపారు. ఆ బియ్యాన్ని భారత ఆహార సంస్థకు అప్పగించడంతో పాటు జాతీయ ఆహార భద్రతా చట్టం, ఇతర సంక్షేమ పథకాల కింద ప్రజలకు పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఈ ప్రక్రియలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది రైతులు, వేలాది కొనుగోలు కేంద్రాలు, లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంభాగస్వాములవుతున్నాని చెప్పారు. ధాన్యం కొనుగోలు విలువ పదివేల కోట్ల రూపాయల్లో ఉంటుందని, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలపై కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రభుత్వం వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. మిల్లింగ్, బియ్యం అప్పగింతలో ప్రతి రోజు ఆలస్యం జరిగినా ప్రభుత్వంపై అదనపు వడ్డీ భారం పడుతుందని మంత్రి గుర్తుచేశారు.

**ప్రభుత్వ ఆస్తుల దారి మళ్లింపు తీవ్రమైన నేరం**

అధిక శాతం రైస్ మిల్లర్లు తమ బాధ్యతలను నిజాయితీగా నిర్వర్తిస్తున్నప్పటికీ, కొంతమంది మిల్లర్ల వద్ద తీవ్రమైన అక్రమాలు వెలుగుచూశాయని మంత్రి తెలిపారు. నిర్ణీత గడువులో కస్టమ్ మిల్లింగ్ బియ్యం అప్పగించకపోవడం, ప్రభుత్వ ధాన్యాన్ని అనధికారికంగా విక్రయించడం, ప్రభుత్వ బియ్యాన్ని దారి మళ్లించడం, తక్కువ పరిమాణంలో బియ్యం అప్పగించడం, నిల్వలను దాచిపెట్టడం, రికార్డులను తారుమారు చేయడం, చట్టబద్ధమైన స్టాక్ రిజిస్టర్లను నిర్వహించకపోవడం వంటి అక్రమాలను గుర్తించినట్లు చెప్పారు. మిల్లులకు అప్పగించిన ప్రభుత్వ ఆస్తులను అక్రమంగా విక్రయించడం, అనేక సీజన్లుగా భారీ సీఎంఆర్ బకాయిలను పేరుకుపోయేలా చేయడం కూడా తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. దారి మళ్లించిన ప్రతి కిలో ధాన్యం ప్రజాధనంతో కొనుగోలు చేసిన ప్రభుత్వ ఆస్తేనని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వానికి తిరిగి చేరని ప్రతి టన్ను బియ్యం ప్రజాపంపిణీ వ్యవస్థను బలహీనపరుస్తుందని, ఆ నష్టాన్ని చివరకు పన్నులు చెల్లించే ప్రజలే భరించాల్సి వస్తుందని పేర్కొన్నారు.

**నాలుగు సూత్రాలతో ప్రభుత్వ విధానం**

ధాన్యం కొనుగోలు, కస్టమ్ మిల్లింగ్ వ్యవస్థలో ప్రభుత్వం నాలుగు స్పష్టమైన సూత్రాలను అనుసరిస్తుందని మంత్రి వెల్లడించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ రైతుల ప్రయోజనాలకు భంగం కలగకుండాధాన్యంకొనుగోలునునిరంతరాయంగా కొనసాగించడం మొదటి ప్రాధాన్యమన్నారు. ఇతరులు చేసే తప్పులకు రైతులు నష్టపోకూడదని స్పష్టం చేశారు. రెండో సూత్రంగా నిజాయితీగల రైస్ మిల్లర్లకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. ఒప్పంద నిబంధనలకు అనుగుణంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మిల్లర్లు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మిల్లులకు అప్పగించిన ప్రతి ధాన్యం గింజకూ పూర్తి లెక్క ఉండేలా జవాబుదారీతనం కల్పించడం మూడో సూత్రమని తెలిపారు. ధాన్యం మిల్లుకు చేరిన క్షణం నుంచి బియ్యం ప్రభుత్వానికి అప్పగించే వరకు ప్రతి దశకు స్పష్టమైన రికార్డు ఉండాలన్నారు. ప్రభుత్వ నిల్వల దారి మళ్లింపు, మోసం, నమ్మకద్రోహం, ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడిన వారిపై ఎలాంటి మినహాయింపు లేకుండా చట్టాన్ని అమలు చేయడం నాలుగో సూత్రమని మంత్రి వివరించారు.

**రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర తనిఖీలు**

రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ధృవీకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ప్రభుత్వం ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. రైస్ మిల్లుల్లో ప్రత్యక్షంగా నిల్వలను పరిశీలించడం, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేయడం, సీఎంఆర్ నిల్వలను ధృవీకరించడం, కొనుగోలు రికార్డులను వాస్తవ నిల్వలతో సరిపోల్చడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ ధాన్యం, బియ్యం నిల్వల్లో కొరత, దారి మళ్లింపును గుర్తించడంతో పాటు అనుమానాస్పద లావాదేవీలపై లోతైన విచారణ జరుపుతామని తెలిపారు. అక్రమాలకు బాధ్యులైన వ్యక్తులను గుర్తించి, అవసరమైన చోట క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులు, బకాయిల వసూలుకు చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు నిరంతరం నిబంధనలు ఉల్లంఘించే మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టడం సహా పరిపాలనాపరమైన చర్యలను పరిశీలిస్తామని చెప్పారు.తనిఖీలు, విచారణల విషయంలో ఏ వ్యక్తికీ, సంస్థకూ మినహాయింపు ఉండదని మంత్రి తేల్చిచెప్పారు.ప్రజాధనంలో ప్రతి రూపాయినీ వసూలు చేస్తాంప్రభుత్వానికి రావాల్సిన ప్రతి రూపాయినీ సాధ్యమైనంత వరకు తిరిగి వసూలు చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి పేర్కొన్నారు. పెండింగ్ సీఎంఆర్ బకాయిలను మిల్లులవారీగా సమీక్షించాలని, వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఒప్పందాల కింద ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న సెక్యూరిటీలను అవసరమైన చోట వినియోగించాలని, బ్యాంకు గ్యారంటీలు, ఇతర ఒప్పంద పరమైన రక్షణలను అమలు చేయాలని సూచించారు. అవసరమైన కేసుల్లో సివిల్, క్రిమినల్ చర్యలను ఏకకాలంలో చేపట్టాలని ఆదేశించారు. కేవలం శిక్షించడం మాత్రమే ప్రభుత్వ ఉద్దేశం కాదని, ప్రభుత్వ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోవడం, ప్రజాధనాన్ని రికవరీ చేయడం, వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.

**సాంకేతికతతో పకడ్బందీ పర్యవేక్షణ**

భవిష్యత్తులో అక్రమాలకు అవకాశం లేకుండా ధాన్యం కొనుగోలు నుంచి బియ్యం అప్పగింత వరకు పటిష్ఠమైన వ్యవస్థను రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ధాన్యం రవాణాను ప్రారంభ స్థానం నుంచి గమ్య స్థానం వరకు డిజిటల్‌గా పర్యవేక్షించడం, జీపీఎస్ ఆధారిత రవాణా పర్యవేక్షణ, నిల్వలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో సరిపోల్చడం వంటి సంస్కరణలను సమీక్షిస్తున్నట్లు చెప్పారు. గోదాములు, రైస్ మిల్లుల తనిఖీలను మరింత బలోపేతం చేయడం, గత పనితీరు ఆధారంగా మిల్లులపై రిస్క్ ఆధారిత ఆడిటింగ్ నిర్వహించడం, ధాన్యం సేకరణ-మిల్లింగ్-ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగింతకు సంబంధించిన డేటాబేస్‌లను అనుసంధానం చేయడం వంటి చర్యలను చేపట్టనున్నట్లు తెలిపారు. సీఎంఆర్ ఖాతాలను నిర్దిష్ట గడువులోగా సరిచూడటం, జిల్లా-రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షణను మెరుగుపరచడం, నిర్దిష్ట వ్యవధుల్లో థర్డ్ పార్టీ ధృవీకరణ నిర్వహించడం ద్వారా మొత్తం సరఫరా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచుతామని మంత్రి పేర్కొన్నారు.

**రైతులకు పూర్తి భరోసా**

రాష్ట్రంలోని రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

రైతులు పండించిన ధాన్యం కొనుగోలు యథావిధిగా కొనసాగుతుందని, కనీస మద్దతు ధరకు పూర్తి రక్షణ ఉంటుందని చెప్పారు. రైతులకు చెల్లింపులు సకాలంలో జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు అనంతరం మిల్లింగ్, నిల్వలు, బియ్యం అప్పగింతలో జరిగే అక్రమాల ప్రభావం రైతులపై పడకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. “ప్రభుత్వం కొనుగోలు చేసే ప్రతి ధాన్యం బస్తా వెనుక రైతు చెమట, కష్టం ఉన్నాయని, ఖర్చు చేసే ప్రతి రూపాయి తెలంగాణ ప్రజలకు చెందిందని ఆయన చెప్పారు. ప్రభుత్వానికి అప్పగించిన ప్రతి ధాన్యం గింజ అంతిమంగా అర్హులైన లబ్ధిదారులకు చేరాలి. రైతులను రక్షించడం, ప్రజాధనాన్ని కాపాడటం, ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రతి దశలో జవాబుదారీతనాన్ని నెలకొల్పడం కోసం ప్రభుత్వం నిష్పక్షపాతంగా, నిర్భయంగా, కఠినంగా వ్యవహరిస్తుంది” అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.

**మిల్లర్లకు విజ్ఞప్తి**

రైస్ మిల్లర్లు తెలంగాణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వాములని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. పెండింగ్ సీఎంఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని, తనిఖీలకు పూర్తి సహకారం అందించాలని, రికార్డుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని మిల్లర్లను కోరారు. తమకు అప్పగించిన ప్రభుత్వ నిల్వలను కాపాడుతూ ప్రభుత్వం-మిల్లింగ్ పరిశ్రమ మధ్య పరస్పర విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. చట్టాన్ని, ఒప్పంద నిబంధనలను పాటించే మిల్లర్లకు ప్రభుత్వ సంపూర్ణ సహకారం ఉంటుందని, ప్రజల ఆస్తులను దుర్వినియోగం చేసే వారిపై మాత్రం కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.

# హరీశ్‌పై మహేశ్ ఆరోపణలు



**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు నిర్వహించారని, ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన, అరుంధతి సినిమాలో చూపించిన తరహాలో హరీశ్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారని ఆరోపించారు.హరీశ్ రావు ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని పేర్కొన్న మహేశ్ కుమార్ గౌడ్, ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. తిరుపతికి వెళ్లిన సందర్భంగా మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు, అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారంటూ ప్రశ్నించారు.తెలంగాణలో వర్షాలు పడకూడదని, రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడాలని కోరుతూ హరీశ్ రావు క్షుద్ర పూజలు చేశారని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని, కానీ రాజకీయ స్వార్థం కోసం ప్రజలకు కీడు జరగాలని కోరుతూ పూజలు చేయడం సమంజసం కాదని విమర్శించారు. ఈ ఆరోపణలకు సంబంధించిన నిజాలను బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని, అయితే అలాంటి నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా గతంలో అఘోరాలతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం జరిగిందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలతో ఆ ప్రచారానికి కూడా బలం చేకూరుతోందని అన్నారు. యాదగిరిగుట్టకు వెళ్లి చేసిన పూజల ఉద్దేశం ఏమిటో ప్రజలకు వివరించాలని హరీశ్ రావును డిమాండ్ చేశారు. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో మంత్రాలు, తంత్రాల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ఘటనలు గతంలో జరిగాయని ఆయన వ్యాఖ్యానించారు. అయితే టీపీసీసీ అధ్యక్షుడు చేసిన ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ లేదా హరీశ్ రావు నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన వెలువడలేదు. ఈ వ్యవహారంపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

# విద్యుత్ ఛార్జీలు పెంచలేదు, ట్రూడౌన్ చేశాం

- మంత్రి గొట్టిపాటి
- అస్తవ్యస్తమైన విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టాం

**విజయవాడ, మహా :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచకుండా ‘ట్రూ డౌన్’ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. విద్యుత్ శాఖలో సాధించిన ప్రగతిపై శ్వేతపత్రం విడుదల చేశామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో వ్యవస్థలను చక్కదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాం. జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలూ సర్వనాశనం అయ్యాయి. మేము వాటిని బాగుచేస్తున్నాం" అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ‘పీఎం సూర్య ఘర్’ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా వినియోగించుకుని, సౌర విద్యుత్ ద్వారా లక్షలాది కనెక్షన్లు ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన విద్యుత్ అవసరాలను తీర్చేందుకు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేస్తున్నామని గొట్టిపాటి తెలిపారు. రైతులకు పెద్ద ఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని అన్నారు.‘ఇంటింటికీ తెలుగుదేశం’ కార్యక్రమంలో భాగంగా, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసి, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూనే, తాము చేస్తున్న పనులను వారి దృష్టికి తీసుకెళుతున్నామని గొట్టిపాటి రవికుమార్ వివరించారు.

# ఢిల్లీకి సీఎం రేవంత్

- నేడు కేంద్ర మంత్రులతో భేటీలు
- 17 నుంచి విదేశీ పర్యటనలు

**హైదరాబాద్,మహా :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి ఢిల్లీకి వెళ్లారు. బుధవారం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో భేటీ కానున్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయనతో చర్చించనున్నట్లు సమాచారం. అలాగే పలువురు కేంద్ర మంత్రులను కూడా సీఎం కలిసే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. బకేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలు, పర్యావరణ అనుమతులు తదితర విషయాలపై ఈ భేటీల్లో చర్చ జరిగే అవకాశం ఉంది. వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం ప్రతిపాదనలు వినిపించనున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించనున్న ఆయన, తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ పర్యటన చేపడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది.పరిశ్రమలు, సమాచార సాంకేతికత, తయారీ, మౌలిక వసతులు, అధునాతన సాంకేతిక రంగాల్లో పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంతో పాటు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో సమావేశాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు సమాచారం. తెలంగాణను పెట్టుబడులకు అత్యంత అనుకూల గమ్యస్థానంగా ప్రపంచ వేదికపై మరింత బలోపేతంగా పరిచయం చేయడమే ఈ విదేశీ పర్యటన ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.



# ట్రంప్ టారిఫ్‌లకు ఎదురుదెబ్బ

**కోర్టుకెక్కిన 25 అమెరికా రాష్ట్రాలు.**

**వాషింగ్టన్, మహా. :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన దిగుమతి సుంకాలపై అమెరికాలోనే వ్యతిరేకత వ్యక్తమవుతోంది. భారత్‌తో పాటు దాదాపు 60 దేశాలపై ట్రంప్ ప్రభుత్వం అమలు చేస్తున్న టారిఫ్‌లను సవాలు చేస్తూ అమెరికాలోని 25 రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. దిగుమతి సుంకాల అమలును తక్షణమే నిలిపివేయాలని కోరుతూ ఆయా రాష్ట్రాలు సంయుక్తంగా పిటిషన్ దాఖలు చేశాయి.

పిటిషన్‌లో ట్రంప్ ప్రభుత్వం అమలు చేస్తున్న టారిఫ్‌ల వల్ల రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు, వ్యాపార రంగం, వినియోగదారులపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నాయి. దిగుమతి వస్తువుల ధరలు పెరగడంతో వ్యాపార వ్యయం అధికమవుతుండగా, దాని భారం చివరకు ప్రజలపై పడుతోందని రాష్ట్రాలు వాదించాయి. ఈ నిర్ణయం దేశీయ వాణిజ్యానికి కూడా ఇబ్బందులు కలిగిస్తోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లాయి.కాంగ్రెస్ ఆమోదం లేకుండానే విస్తృత స్థాయిలో దిగుమతి సుంకాలను విధించడం ద్వారా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన అధికారాలను దుర్వినియోగం చేశారని రాష్ట్రాలు ఆరోపించాయి. అధ్యక్ష అధికారాల రాజ్యాంగబద్ధ పరిమితిని ఈ నిర్ణయం దాటిందని, అందువల్ల టారిఫ్‌లను చట్టవిరుద్ధంగా ప్రకటించి రద్దు చేయాలని కోర్టును కోరాయి .ఈ కేసు అమెరికా వాణిజ్య విధానంతో పాటు అధ్యక్ష అధికారాల పరిధిపై కీలక ప్రభావం చూపే అవకాశముందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. కోర్టు తీర్పు ట్రంప్ ప్రభుత్వం అమలు చేస్తున్న టారిఫ్ విధానాల భవిష్యత్తును నిర్ణయించే అవకాశం ఉండటంతో ఈ వ్యవహారం అంతర్జాతీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.

# రూ.400 కోట్ల ఆదా లక్ష్యం



హైదరాబాద్, మహా: తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ పరిపాలనలో మరో కీలక అడుగు వేస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలకు పూర్తిగా స్వస్తి పలుకుతూ, సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కేవలం "టీఫైబర్" ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని రాష్ట ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.300 నుంచి రూ.400 కోట్ల వరకు ఆదా కావడంతో పాటు, డేటా భద్రత కూడా మరింత బలోపేతం కానుంది. తెలంగాణ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన టీఫైబర్ అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ కార్యాలయం కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు బిల్లులు చెల్లించరాదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 4,487 ప్రభుత్వ కార్యాలయాలను టీఫైబర్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ చర్య వల్ల గత ఆరు నెలల్లోనే ప్రభుత్వానికి సుమారు రూ.13 కోట్ల మేర ఖర్చు ఆదా అయిందన్నారు. మిగిలిన కార్యాలయాలను కూడా త్వరితగతిన టీఫైబర్ పరిధిలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

టీఫైబర్ ద్వారా ప్రభుత్వ కార్యాలయాలను రాష్ట్ర డేటా సెంటర్‌తో నేరుగా అనుసంధానం చేయడం వల్ల సురక్షితమైన ఇంట్రానెట్ వ్యవస్థ ఏర్పడి, ప్రభుత్వ సమాచారానికి అత్యున్నత స్థాయి భద్రత లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్‌లో సైబర్ భద్రతకు ఇది కీలకంగా మారుతుందన్నారు.

తెలంగాణ వైడ్ ఏరియా నెట్‌వర్క్ (టీస్వాన్)ను కూడా నెల రోజుల్లో పూర్తిస్థాయిలో టీఫైబర్‌కు బదిలీ చేయాలని ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న "భారత్ ఫ్యూచర్ సిటీ"కి అత్యాధునిక ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకుండా, ఇంటింటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ అందించడంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ లక్ష్యంతో ప్రిన్సిపల్ మానిటైజేషన్ పార్ట్నర్ ఎంపిక కోసం టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. డిజిటల్ తెలంగాణ నిర్మాణంలో టీఫైబర్ కీలక మైలురాయిగా మారనున్న నేపథ్యంలో, ప్రభుత్వ వ్యయ నియంత్రణతో పాటు ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన డిజిటల్ సేవలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఈ నిర్ణయం నిదర్శనంగా నిలుస్తోంది.



# పకడ్బందీగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

(మొదటి పేజీ తరువాయి )

ఉన్నతాధికారులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్ కు సంబంధించి నియామక ప్రక్రియను పకడ్బందీగా, పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. నియమ నిబంధనలను అనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతో పాటు అన్ని ప్రక్రియలలో అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా కోచింగ్ సెంటర్స్ పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. నియామక పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్ సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటలీజెన్స్ విభాగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ అత్యవసర సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ వి.వి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

# వల్గర్ నిధి

- త్రిషపై డబుల్ మీనింగ్ వ్యాఖ్యలు.. అరెస్ట్
- తమిళ నాడులో ఉద్రిక్తత.. బెయిల్ పై రిలీజ్

**చెన్నై, మహా :** నటి త్రిషకు సంబంధించిన వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వల్గర్ నిధిగా చీవాట్లు తిన్న డీఎంకే నేత, తమిళనాడు అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టు మంగళవారం ఊరటనిచ్చింది. ఆయనకు బెయిల్ మంజూరు చేసిన న్యాయస్థానం, విచారణ పూర్తయిన వెంటనే విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. దీంతో ఉద్రిక్తతల నడుమ మంగళవారం రాత్రి విడుదల చేశారు. కావేరి జలాల అంశంపై నిర్వహించిన ఆందోళన సభలో ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు సినీ నటి త్రిషను ఉద్దేశించినవేనని వివాదం చెలరేగింది. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేసి, చెన్నైలోని ఆయన నివాసానికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

పోలీసుల చర్యను సవాల్ చేస్తూ డీఎంకే తరఫున మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. అత్యవసరంగా విచారణ చేపట్టిన ధర్మాసనం, దర్యాప్తు అవసరాల మేరకు ఉదయనిధిని ప్రశ్నించే అధికారం పోలీసులకు ఉన్నప్పటికీ బలవంతం చర్యలు వద్దని సూచించింది.

మద్రాస్ హైకోర్టు తాజా ఆదేశాలతో ఉదయనిధి స్టాలిన్‌కు తాత్కాలిక ఊరట లభించినట్లైంది.

# అమెరికా వేదికగా బీజేపీ గురి

- తెలంగాణలో అధికారమే లక్ష్యం.
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు.

**న్యూజెర్సీ (అమెరికా), మహా :** తెలంగాణలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు స్పష్టం చేశారు. అమెరికాలోని న్యూజెర్సీ రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘మీట్ అండ్ గ్రీట్’ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు.భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక శక్తిగా ఎదిగిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం మౌలిక సదుపాయాల రంగంలో అపూర్వమైన పురోగతి సాధించిందని రాంచందర్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 75 విమానాశ్రయాలు మాత్రమే ఉండగా, ఎన్డీఏ పాలనలో వాటి సంఖ్య 150కు పెరిగిందని తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధి దేశ ప్రగతికి నిదర్శనమని అన్నారు.

రానున్న జీహెచ్‌ఎంసీ, తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన రాష్ట్ర అభివృద్ధిని దెబ్బతీసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజల ఆశలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఈ రెండు పార్టీల పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ఆ పరిస్థితులు బీజేపీకి అనుకూలంగా మారుతున్నాయని పేర్కొన్నారు.కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశాభివృద్ధి, జాతీయ భద్రత, మౌలిక సదుపాయాల కల్పనలో విశేష పురోగతి సాధించిందని రాంచందర్‌రావు అన్నారు. డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, వందే భారత్ రైళ్లు, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్, పీఎం కిసాన్ వంటి పథకాలు దేశాభివృద్ధికి బలమైన పునాది వేశాయని పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం, మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి కీలక నిర్ణయాలను కూడా ఆయన ప్రస్తావించారు.ఈ సందర్భంగా తెలంగాణ బీజేపీ రాష్ట్ర కోశాధికారి డి. వాసుదేవరావు మాట్లాడుతూ రాంచందర్‌రావు నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి అనుగుల, తెలంగాణ కన్వీనర్ విలాస్‌రెడ్డి జంబులా తదితరులు మాట్లాడుతూ అమెరికాలోని ప్రవాస భారతీయులు దేశభక్తి, జాతీయవాద భావజాలంతో బీజేపీకి అండగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్‌ను ప్రపంచ అగ్రదేశంగా తీర్చిదిద్దే లక్ష్యానికి తాము కూడా భాగస్వాములమవుతామని ప్రవాస భారతీయులు పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో అతిథులను ఘనంగా సన్మానించారు.

# సినీ పరిశ్రమలో విషాదం

**ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ కన్నుమూత.**
**వెండితెర విలన్‌కు శాశ్వత వీడ్కోలు.**



**ముంబై, మహా** భారతీయ సినీ పరిశ్రమలో విలక్షణ నటుడిగా, విలన్ పాత్రలకు తనదైన శైలితో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ (74) కన్నుమూశారు. గత కొంతకాలంగా రక్త క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో భారతీయ సినీ పరిశ్రమ తీవ్ర విషాదంలో మునిగిపోయింది. సినీ, రాజకీయ ప్రముఖులు ఆయన మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నారు.బీఆర్ చోప్రా రూపొందించిన చారిత్రాత్మక టెలివిజన్ ధారావాహిక *'మహాభారత్'*లో అశ్వత్థామ పాత్రతో నట జీవితాన్ని ప్రారంభించిన ప్రదీప్ రావత్, అనంతరం బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ చిత్రాల్లో తనదైన ముద్ర వేశారు. హిందీలో 'సర్ఫరోష్', 'లగాన్' చిత్రాలతో గుర్తింపు పొందిన ఆయన, ఆ తర్వాత పలు భాషల్లో శక్తివంతమైన ప్రతినాయక పాత్రలతో ప్రేక్షకులను అలరించారు.తెలుగు ప్రేక్షకులకు మాత్రం దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన 'సై' చిత్రంలోని 'భిక్షు యాదవ్' పాత్రతో చిరస్మరణీయుడయ్యారు. ఆ పాత్రలో ఆయన ప్రదర్శించిన నటన తెలుగు సినీ చరిత్రలో అత్యుత్తమ విలన్ పాత్రల్లో ఒకటిగా నిలిచింది. అనంతరం 'భద్ర', 'ఛత్రపతి', 'స్టాలిన్', 'గజినీ' తదితర చిత్రాల్లో విభిన్న పాత్రలతో తన నటనకు మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన చివరిగా నటించిన చిత్రం 'గాయపడ్డ సింహం' ఈ ఏడాది మే నెలలో విడుదలైంది.1952 జనవరి 21న మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జన్మించిన ప్రదీప్ రామ్‌సింగ్ రావత్, సిమ్లాలోని మిలిటరీ పాఠశాలలో విద్యనభ్యసించి, జబల్‌పూర్ ప్రభుత్వ సైన్స్ కళాశాలలో ఉన్నత విద్య పూర్తిచేశారు. కొంతకాలం యూకో బ్యాంకులో ఉద్యోగం చేసిన అనంతరం నటనపై ఆసక్తితో రంగస్థల కళాకారుడిగా ప్రస్థానం ప్రారంభించారు. దూరదర్శన్‌లో ప్రసారమైన 'మహాభారత్' సీరియల్‌లో అశ్వత్థామ పాత్ర ఆయన సినీ జీవితానికి బలమైన పునాది వేసింది. ప్రముఖ నటి స్మితా పాటిల్ సిఫారసుతో ఆ పాత్ర దక్కడం ఆయన జీవితంలో కీలక మలుపుగా మారింది.రాజ్ బబ్బర్ నాటక సంస్థతో కలిసి దేశవ్యాప్తంగా అనేక రంగస్థల ప్రదర్శనల్లో పాల్గొన్న ప్రదీప్ రావత్, అనుపమ్ ఖేర్, అలోక్ నాథ్, అనితా కన్వార్ వంటి ప్రముఖులతో కలిసి నటించారు. రంగస్థలం నుంచి వెండితెర వరకు తన నటనతో ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసిన ఆయన మరణం భారతీయ సినీ పరిశ్రమకు తీరని లోటుగా సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకుల మదిలో భిక్షు యాదవ్ గా ఆయన ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారని అభిమానులు భావోద్వేగంతో నివాళులర్పిస్తున్నారు.



## రాహుల్ వ్యాఖ్యలపై
# రాజకీయ దుమారం

**దేశ రాజకీయాల్లో వేడెక్కిన వాతావరణం.**

**ఢిల్లీ, మహా :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన తాజా వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఢిల్లీలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్‌ను లక్ష్యంగా చేసుకుని ఆయన చేసిన విమర్శలు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధానికి తెరలేపాయి. విద్యార్థులపై నమోదైన కేసులు, వారిపై తీసుకుంటున్న చర్యల విషయంలో ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించిన రాహుల్ గాంధీ, వారిని క్షమించే అధికారం ప్రధానికి ఎవరు ఇచ్చారని నిలదీశారు. అలాగే ఆర్ఎస్ఎస్ భావజాలం దేశ సమగ్రతకు ముప్పుగా మారుతోందని ఆరోపించారు.రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ప్రధాని, ఆర్ఎస్ఎస్‌పై ఆధారరహిత ఆరోపణలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించింది. ఈ వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో మరోసారి అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదానికి కారణమయ్యాయి.ఇదిలా ఉండగా, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మదరసా విద్యా వ్యవస్థలో కీలక మార్పులు చేసింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో కాలిమ్, ఫాజిల్ డిగ్రీ కోర్సులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇకపై మదరసాల్లో 12వ తరగతి వరకు మాత్రమే విద్య కొనసాగనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.మహారాష్ట్ర రాజకీయాల్లో కూడా ఉద్రిక్తత కొనసాగుతోంది. డిప్యూటీ ముఖ్యమంత్రి సునేత్ర పవార్‌ను కాంగ్రెస్ నేతలు 'గూంగీ గుడియా'గా సంబోధించడంపై ఎన్సీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళా నాయకురాలిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం తగదని డిప్యూటీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఏక్నాథ్ షిండే మండిపడ్డారు. ఈ వివాదం రాష్ట్ర రాజకీయాలను మరింత వేడెక్కించింది.

మరోవైపు దేశ భద్రత, విదేశాంగ అంశాల్లో కూడా కేంద్ర ప్రభుత్వం కీలక వివరాలు వెల్లడించింది. గత ఏడు సంవత్సరాల్లో 36 దేశాల నుంచి 274 మంది పరారీలో ఉన్న నేరస్థులను భారత్‌కు అప్పగింపజేసినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఉగ్రవాదులు, గ్యాంగ్‌స్టర్లు, ఆర్థిక నేరస్థులను స్వదేశానికి రప్పించడంలో భారత్ విజయవంతమైందని పేర్కొంది.పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో జరిగిన ఎన్నికలపై కూడా భారత విదేశాంగ శాఖ స్పందించింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నిర్వహించిన ఎన్నికలను భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తించదని స్పష్టం చేసింది. ఆ ప్రాంతం భారతదేశంలో అంతర్భాగమేనని, పాకిస్తాన్ నిర్వహిస్తున్న ఎన్నికలు కేవలం రాజకీయ ప్రదర్శన మాత్రమేనని విదేశాంగ శాఖ పేర్కొంది.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలు, బీజేపీ ప్రతిస్పందన, ఉత్తరప్రదేశ్ విద్యా సంస్కరణలు, మహారాష్ట్ర రాజకీయ వివాదాలు, కేంద్ర ప్రభుత్వ భద్రతా చర్యలు, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌పై భారత వైఖరి వంటి పరిణామాలతో దేశ రాజకీయాలు మరింత వేడెక్కిన పరిస్థితి నెలకొంది.

## స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను
# తక్షణమే విడుదల చేయాలి

**ఆగస్టు 6న ఇందిరా పార్క్ వద్ద జరిగే ఎస్ఎఫ్ఐ మహాధర్నాను విద్యార్థులు జయప్రదం చేయాలి**

ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మేడబోయిన మమతవలిగొండ ఆగస్టు 4 మహా న్యూస్ : మంగళవారం వలిగొండ మండల కేంద్రంలోని స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మేడబోయిన మమత హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు సంబంధించిన స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు తమ విద్యను కొనసాగించడంలో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఆరు సంవత్సరాల నుంచి పదివేల నాలుగు వందల కోట్ల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్లో ఉన్నాయి, స్కాలర్షిప్లు రాక విద్యార్థులకు దూరం అవుతున్నారు, ప్రైవేటు విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులకు సత్య విచ్చే పరిస్తితి లేదు సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పిన పరిస్థితి, పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్



ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ మహాధర్నాలో రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు వేల సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు ,జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల రాహుల్, తిగుళ్ళ శ్రీనివాస్, పుట్టల ఉదయ్, జిల్లా కమిటీ సభ్యులు నేహాల్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# జూరాలకు భారీ వరద ఉధృతి

**33 గేట్లు ఎత్తి నీటి విడుదల.**



**మహబూబ్‌నగర్, మహా.**
ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. మంగళవారం రాత్రి జూరాల జలాశయంలోకి 2.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా, అదే స్థాయిలో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. పెరుగుతున్న వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.భారీ ఇన్‌ఫ్లో కారణంగా జూరాల ప్రాజెక్టు 33 గేట్లను ఎత్తి 2.50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణా నది పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు.ప్రాజెక్టు నుంచి భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలకు కూడా నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాలువలకు సాగునీటిని విడుదల చేసి ఆయకట్టు అవసరాలను తీర్చే చర్యలు చేపట్టారు.వరద పరిస్థితుల దృష్ట్యా జలాశయం పరిసర ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, నీటి ప్రవాహం ఆధారంగా గేట్ల నిర్వహణపై నిరంతరం సమీక్ష కొనసాగుతోందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

# మద్యం దిగ్గజాలకు షాక్

- **బ్రాండెడ్ విస్కీ, రమ్ విక్రయాలపై ఉక్కుపాదం.**
- **కృత్రిమ ఫ్లేవర్ల వాడకంతో గుట్టురట్టు.**
- **ఆగిపోయిన అగ్రశ్రేణి బ్రాండ్ల సరఫరా.**
- **తెలుగు రాష్ట్రాల ఆదాయానికి వేల కోట్ల గండి.**



**హైదరాబాద్, మహా:** భారతీయ మద్యం రంగ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అత్యంత సంచలనాత్మక నిర్ణయం వెలువడింది. దేశవ్యాప్తంగా మందుబాబులు అత్యంత ఇష్టంగా తాగే పలు ప్రముఖ విస్కీ, రమ్ బ్రాండ్ల విక్రయాలపై భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సంచలన నిషేధం విధించింది. ఆహార, పానీయాల భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలపై నిర్వహించిన విస్తృత తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూశాయి. దశాబ్దాలుగా మార్కెట్‌ను ఏలుతున్న దేశీయ, అంతర్జాతీయ బహుళజాతి కంపెనీల ఫ్లాగ్‌షిప్ బ్రాండ్లన్నీ ఈ నిషేధ జాబితాలో ఉండటంతో ఆబ్కారీ వర్గాలు, మార్కెట్ నిపుణులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

**నిషేధానికి దారితీసిన అసలు కారణాలివే**

నాణ్యమైన విస్కీ లేదా రమ్ తయారు కావాలంటే ధాన్యాలు లేదా బెల్లం పాకం ద్వారా వచ్చిన ఆల్కహాల్‌ను చెక్క పీపాల్లో నిర్ణీత కాలం పాటు నిల్వ ఉంచి సహజసిద్ధంగా పరిపక్వత చెందించాలి. ఈ ప్రక్రియ ద్వారానే మద్యానికి సహజ సిద్ధమైన రంగు, ప్రత్యేకమైన రుచి లభిస్తాయి. కానీ, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడానికి, తయారీ కాలాన్ని దాటవేసేందుకు పేరుమోసిన కంపెనీలు ఈ ప్రాథమిక అంతర్జాతీయ సూత్రాన్ని పూర్తిగా గాలికొదిలేశాయి. సహజ పరిపక్వతకు బదులుగా ఆల్కహాల్‌లో నేరుగా కృత్రిమ రసాయన ఫ్లేవర్లు, సింథటిక్ సువాసనలు కలిపి వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నట్లు కేంద్ర ఆహార భద్రతా సంస్థ నిర్వహించిన సుదీర్ఘ ల్యాబ్ పరీక్షల్లో నిరూపితమైంది. తక్షణమే చర్యలకు ఉపక్రమించిన అధికారులు..ఆంటిక్విటీ బ్లూ, రాయల్ ఛాలెంజ్, బ్యాగ్‌పైపర్ డీలక్స్ వంటి విస్కీలతో పాటు దశాబ్దాల చరిత్ర కలిగిన ఓల్డ్ మాంక్, మెక్‌డోవెల్స్ రమ్ వంటి బ్రాండ్ల సరఫరాను మార్కెట్లో ఎక్కడికక్కడ నిలిపివేశారు. కేవలం మద్యం పరిశ్రమపైనే కాకుండా, తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్న డాబర్ వంటి సంస్థలు, కెఫిన్ ఎక్కువగా ఉండే ఎనర్జీ డ్రింక్స్ పైనా అధికారులు కఠిన చర్యలు చేపట్టారు.

**కుదేలైన మద్యం సామ్రాజ్యం**

ఈ ఆకస్మిక నిర్ణయంతో యునైటెడ్ స్పిరిట్స్ (డయాజియో ఇండియా), ఇన్బ్రెవ్ బెవరేజెస్, మోహన్ రాకీ స్ప్రింగ్‌వాటర్ వంటి అగ్రగామి సంస్థలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయి. దేశంలో ఏటా 3 లక్షల 30 వేల కోట్ల రూపాయలకు పైగా ఉన్న ఆల్కహాలిక్ బెవరేజెస్ మార్కెట్‌లో విస్కీ, రమ్‌ల వాటానే 70 శాతానికి పైగా ఉంటుంది. నిషేధానికి గురైన బ్రాండ్లు ఇందులో 40 శాతం మార్కెట్‌ను ఏలుతున్నాయి. సప్లై చైన్, బాట్లింగ్ యూనిట్లు, డిపోల్లో మిగిలిపోయిన స్టాక్ వృథా కావడం వల్ల ఉత్పత్తిదారులకు తక్షణమే 2 వేల కోట్ల నుంచి 3500 కోట్ల రూపాయల వరకు ప్రత్యక్ష నష్టం వాటిల్లనుందని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం పొంచి ఉంది.

**తెలుగు రాష్ట్రాల ఖజానాకు భారీ గండి**

భారతదేశంలో అత్యధికంగా మద్యం వినియోగించే రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానాల్లో ఉన్నాయి. రెండు రాష్ట్రాల ప్రభుత్వ ఖజానాలకు ఆబ్కారీ శాఖ పన్ను ఆదాయమే అత్యంత కీలకం. తెలంగాణలో రాయల్ ఛాలెంజ్, ఆంటిక్విటీ బ్లూ, బ్యాగ్‌పైపర్‌కు విపరీతమైన డిమాండ్ ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఓల్డ్ మాంక్, మెక్‌డోవెల్స్ రమ్‌కు విశేషమైన క్రేజ్ ఉంది. ఎఫ్ఎస్ఎస్ఏఐ తాజా నిషేధంతో రెండు రాష్ట్రాల ఆదాయంపై తీవ్ర ప్రభావం పడనుంది.తెలుగు రాష్ట్రాల మద్యం ఆదాయం, నష్టాల అంచనాలను లోతుగా పరిశీలిస్తే ఈ నిషేధ ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో స్పష్టంగా అర్థమవుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏటా సుమారు 36,000 కోట్ల రూపాయల ఎక్సైజ్ రాబడిని సాధిస్తుండగా, ఆంధ్రప్రదేశ్ సుమారు 28,000 కోట్ల రూపాయల ఆదాయాన్ని పొందుతోంది. అంటే రెండు రాష్ట్రాల ఉమ్మడి వార్షిక ఆదాయం దాదాపు 64,000 కోట్ల రూపాయలుగా ఉంది. ఇప్పుడు నిషేధానికి గురైన బ్రాండ్ల రోజువారీ అమ్మకాలను గమనిస్తే, తెలంగాణలో 22 నుంచి 28 కోట్ల రూపాయలు, ఏపీలో 18 నుంచి 22 కోట్ల రూపాయల మేర వ్యాపారం జరుగుతోంది. ఈ లెక్కన రెండు రాష్ట్రాల్లో ఉమ్మడి రోజువారీ అమ్మకాలు 40 నుంచి 50 కోట్ల రూపాయల వరకు ఉంటాయి. తాజా పరిణామాలతో తెలంగాణ ప్రభుత్వానికి నెలకు 450 నుంచి 650 కోట్ల రూపాయల మేర, అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 350 నుంచి 550 కోట్ల రూపాయల మేర పన్ను రాబడిలో తాత్కాలిక లోటు ఏర్పడనుంది. ఉమ్మడిగా చూస్తే నెలకు 800 నుంచి 1,200 కోట్ల రూపాయల భారీ ఆదాయం గల్లంతు కానుంది. మార్కెట్ వాటా పరంగా చూస్తే తెలంగాణలో 20 నుంచి 22 శాతం, ఏపీలో 16 నుంచి 18 శాతం చొప్పున సగటున 19 శాతం మార్కెట్‌పై ఈ నిషేధ ప్రభావం పడింది. ప్రధానంగా తెలంగాణలో విస్కీ విభాగానికి, ఆంధ్రప్రదేశ్‌లో రమ్ విభాగానికి భారీ దెబ్బ తగలడంతో ఉమ్మడి మార్కెట్ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది.

**చారిత్రాత్మక అడుగు.. భవిష్యత్తు పరిణామాలు**

నాణ్యతా ప్రమాణాల విషయంలో కేంద్రం తీసుకున్న ఈ కఠిన నిర్ణయం వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణ దిశగా ఒక చారిత్రాత్మక అడుగు. లాభాపేక్షతో ప్రమాణాలను అటకెక్కించే కార్పొరేట్ కంపెనీలకు ఇది ఒక గట్టి హెచ్చరిక. ఇకపై ఈ సంస్థలు తమ ఉత్పత్తులను 'ఫ్లేవర్డ్ స్పిరిట్' అని లేబుల్ మార్చి అమ్ముకోవడమో లేదా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా తయారీ పద్ధతులను మార్చుకోవడమో చేయక తప్పదు. అయితే, మార్కెట్లో ఏర్పడిన ఈ తాత్కాలిక శూన్యాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు రాడికో ఖైతాన్, అలైడ్ బ్లెండర్స్ వంటి ఇతర సంస్థలు తమ వ్యాపార విస్తరణకు పావులు కదుపుతుండటం గమనార్హం

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 4 మహా :** వాసాలమర్రి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంద్రమ్మ ఇండ్ల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అధికారులు గ్రామంలో ప్రస్తుతం సాగుతున్న మీవాన్ టెక్నాలజీ మరియు ఏఏసీ లైట్ వెయిట్ ఇటుకల నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులందరూ తమ ఇండ్ల నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేసుకోవాలని అధికారుల బృందం వారిని ప్రోత్సహించింది. అనంతరం, బేస్‌మెంట్ లెవెల్ బిలో బేస్‌మెంట్ లెవెల్ దశల్లో ఉండి, ఇంకా పనులు ప్రారంభం కాని ఇండ్లను అధికారులు ప్రత్యేకంగా తనిఖీ చేశారు. ఆయా ఇండ్ల నిర్మాణాలను వెంటనే వేగవంతం చేయాలని ఆదేశించారు. వీటితో పాటు రూఫ్ లెవెల్ రూఫ్ కాస్ట్, సెంటరింగ్ లెవెల్ దశల్లో ఉన్న ఇండ్ల ప్రగతిపై ఆరా తీస్తూ, పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు



.ఈ కార్యక్రమంలో పి. డి హౌసింగ్ ఏ డి అలివేలు,ఎంపీడీఓ, డిప్యూటీ ఈఈ, హౌసింగ్ ఏఈ పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్, స్థానిక లబ్ధిదారులు మరియు హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లి బిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 4 మహా :** అంగన్వాడీ కేంద్రానికి వచ్చే తల్లి,బిడ్డల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని అంగడి బజార్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రం-3, మరియు రాయగిరి అంగన్వాడీ సెంటర్ ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించారు..ఈ సందర్భంగా కేంద్రంలో నమోదైన చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, బాలింతల వివరాల సంఖ్య ఎంత అని , వారందరూ ప్రతిరోజూ కేంద్రానికి హాజరవుతున్నారా లేదా అనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. హాజరును ఏ విధంగా నమోదు చేస్తున్నారని ,అటెండెన్స్ నిర్వహణ ను పరిశీలించారు.చిన్నారులకు ప్రతిరోజూ ఏ విధమైన పోషకాహారం ఇస్తున్నారని , చదువు,ఆటల ఏ విధంగా నేర్పిస్తున్నారని అంగన్వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.చిన్నారుల తల్లిదండ్రులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం చిన్నారులకు రంగులు, బొమ్మలు చూపించి వాటి పేర్లు చెప్పించాలని ప్రోత్సహిస్తూ వారి అభ్యాస స్థాయిని పరిశీలించారు.గర్భిణీ స్త్రీలు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం సక్రమంగా అందుతున్నదా అని ,పాలు, గుడ్లు, పప్పులు తదితర పోషకాహార పదార్థాలు తగినంతగా సరఫరా అవుతున్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు .అక్కడకు వచ్చిన గర్భిణీ స్త్రీలతో కలెక్టర్ మాట్లాడుతూ రక్తహీనత శాతం ఎంత ఉందని అడిగి తెలుసుకున్నారు.ఎప్పుడు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఏఆసుపత్రిలో వైద్య పరీక్షలుచేయించుకుంటున్నారని గర్భిణీ స్త్రీ ని కలెక్టర్ తెలుసుకున్నారు. స్కానింగ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని, మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని, జిల్లా జనరల్ ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అనంతరం అంగన్వాడీ టీచర్లతో మాట్లాడుతూ,విధులు నిర్వహిస్తున్న బీఎల్వోలుగా వారు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు సంబంధించిన అన్ని ఫారాలను అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి సేకరించాలని సూచించారు. ఇంకా మిగిలి ఉన్న వారి నుండి కూడా ఫారాలు సేకరించి, పూర్తిగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లు లేకుండా సరిచూసి సమర్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ అధికారి శ్రీనివాస్, యం పి డి ఓ నవీన్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు




# అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు ప్రాతినిధ్యం ఇవ్వాలి

- **ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు**
- **జర్నలిస్టుల హక్కులకు మరోసారి న్యాయస్థానం అండ**

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)ల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)కు ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విషయంలో జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని హైకోర్టు స్పష్టం చేసింది. అన్ని అర్హులున్న టీడబ్ల్యూజేఎఫ్ కు అక్రెడిటేషన్ కమిటీల్లో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలను ఏర్పాటు చేసే సమయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు ప్రాతినిధ్యం ఇవ్వకుండా వ్యవహరించడాన్ని సవాల్ చేస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు దాఖలైన రిట్ పిటిషన్‌పై గత ఆరు నెలలుగా పలుమార్లు విచారణ జరిగింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ కార్యాలయ న్యాయవాదులు, పిటిషనర్ తరఫున న్యాయవాదులు తమ వాదనలు కోర్టు ముందు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విధానం, జర్నలిస్టు సంఘాల ప్రాతినిధ్యానికి సంబంధించిన నిబంధనలను పరిశీలించిన అనంతరం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ మొహినుద్దీన్‌ల ధర్మాసనం సోమవారం తీర్పును వెలువరించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు కూడా తగిన ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ తీర్పుతో రాష్ట్రంలోని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు అధికారిక ప్రాతినిధ్యం లభించే మార్గం సుగమమైంది. జర్నలిస్టు సంఘాల మధ్య సమాన అవకాశాలు, పారదర్శకత, న్యాయబద్ధమైన ప్రాతినిధ్యానికి ఈ తీర్పు దోహదపడుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

హైకోర్టు తీర్పును తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించింది. జర్నలిస్టుల హక్కులు, గౌరవం, సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్న తమ పోరాటానికి ఇది న్యాయపరమైన విజయమని పేర్కొంది. ఈ తీర్పును వెంటనే అమలు చేసి, అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సంఘం నాయకులు కోరారు.

ఈ తీర్పు భవిష్యత్తులో మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటులో అన్ని గుర్తింపు పొందిన జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేలా మార్గదర్శకంగా నిలుస్తుందని జర్నలిస్టు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. న్యాయం, ధర్మం తమవైపు ఉందని, హైకోర్టు ఇచ్చిన తీర్పు తమ సంఘం సభ్యుల విజయం అని రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు.

## జనన–మరణ
# నమోదు బిల్లుకు ఆమోదం

**రాజ్యసభలో మూజువాణి ఓటుతో పాస్.**

**ఢిల్లీ, మహా :** జనన, మరణ నమోదు (సవరణ) బిల్లు-2026కు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఇప్పటికే లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లును మంగళవారం రాజ్యసభ కూడా మూజువాణి ఓటుతో ఆమోదించింది. దీంతో రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఈ బిల్లు చట్టరూపం దాల్చనుంది. అయితే నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, అయోధ్య రామమందిరంలో విరాళాల చోరీ అంశాలపై విపక్ష సభ్యుల నిరసనల మధ్యే బిల్లును ఆమోదించడం గమనార్హం.సభ ప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యులు వెల్‌లోకి దిగి కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు హాజరై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దీంతో రాజ్యసభను రెండుసార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైన అనంతరం గందరగోళం మధ్యే ప్రభుత్వం బిల్లును మూజువాణి ఓటుకు పెట్టగా అది ఆమోదం పొందింది.1969 జనన, మరణ నమోదు చట్టంలో కీలక మార్పులు చేస్తూ తీసుకొచ్చిన ఈ సవరణ బిల్లు ప్రకారం, జననం లేదా మరణం జరిగిన 21 రోజులలోపు సమాచారం అందిస్తే ఎలాంటి రుసుము లేకుండా నమోదు కొనసాగుతుంది. 21 రోజుల నుంచి ఒక సంవత్సరం వరకు ఆలస్యమైనా నిర్ణీత రుసుము చెల్లించి నమోదు చేసుకునే అవకాశం యథాతథంగా ఉంటుంది.

# మతాలకు అతీతంగా మాఫియా



**గణాంకాల వెనుక దాగిన వాస్తవాలు.**

సమకాలీన ప్రపంచంలో నేరాలు, సామాజిక రుగ్మతలు, మరియు ఉగ్రవాద కార్యకలాపాల గణాంకాలను పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వస్తాయి. ఒకవైపు వ్యభిచారం, మద్యపానం లాంటి వ్యసనాలు అభివృద్ధి చెందిన దేశాలను సైతం పట్టిపీడిస్తుండగా, మరోవైపు డ్రగ్స్, హత్యలు, గ్యాంగ్ వార్స్ , ఉగ్రవాదం లాంటివి అభివృద్ధి చెందుతున్న దేశాలను రక్తమోడుస్తున్నాయి. అయితే, ఈ గణాంకాలను పైపైన చూసినప్పుడు కొన్ని దేశాలు లేదా నిర్దిష్ట మతాలకు చెందిన వారు మాత్రమే ఈ నేరాల్లో ముందున్నారనే అపోహ కలుగుతుంది. వాస్తవానికి, ఏ దేశపు నేర చరిత్రకైనా, అక్కడి ప్రజల మత విశ్వాసాలకు ఎలాంటి సంబంధం లేదు.

**సామాజిక రుగ్మతలు , భౌగోళిక, ఆర్థిక పరిస్థితులు**

వ్యభిచారం , మద్యపానం వంటి సామాజిక సవాళ్లను విశ్లేషించినప్పుడు, భౌగోళిక పరిస్థితులు, ఆర్థిక విధానాలు ఎంతగానో ప్రభావం చూపుతాయని అర్థమవుతుంది. పర్యాటక రంగంపై ఆధారపడిన ఆసియా దేశాలతో పాటు, ఐరోపాలోని డెన్మార్క్, జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్ లాంటి దేశాల్లో వ్యభిచారం ఒక వ్యవస్థాగత పరిశ్రమగా మారింది. ఈ దేశాల్లో క్రైస్తవ జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ, దానికి ఆ మతానికి ఎలాంటి సంబంధం లేదు. ఇది పూర్తిగా ఆయా దేశాలలోని స్వేచ్ఛాయుత చట్టాల మీద ఆధారపడి ఉంది. గణాంకాలను పరిశీలిస్తే, జర్మనీలో 2002లో వ్యభిచారాన్ని చట్టబద్ధం చేసిన తర్వాత, అక్కడి సెక్స్ వర్క్ పరిశ్రమ విలువ ఏడాదికి సుమారు 16 బిలియన్లు (సుమారు 1.4 లక్షల కోట్ల రూపాయలు) దాటింది. అలాగే, థాయ్ ఆర్థిక వ్యవస్థలో ఈ పరిశ్రమ సుమారు 10 శాతం వాటాను కలిగి ఉంది. ఇది పూర్తిగా పర్యాటక రంగంపై ఆధారపడిన ఆర్థిక వ్యూహం మాత్రమే.

ఇక మద్యపానం విషయానికి వస్తే, ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం తూర్పు ఐరోపా దేశాలు అగ్రస్థానంలో ఉన్నాయి. శీతల వాతావరణం, వందల ఏళ్లుగా వస్తున్న సామాజిక జీవనశైలి దీనికి ప్రధాన కారణం. సగటున ఒక వ్యక్తి ఏడాదికి తీసుకునే మద్యం లెక్కలను చూస్తే.. మాల్డోవాలో అత్యధికంగా 15.2 లీటర్లు, లిథువేనియాలో 15.0 లీటర్లు, చెక్ రిపబ్లిక్‌లో 14.4 లీటర్లు, బెలారస్‌లో 13.9 లీటర్ల మద్యం వినియోగిస్తున్నారు. ఈ దేశాల్లో ఏ ఒక్కరూ ఒక నిర్దిష్ట మతం కారణంగా ఈ వ్యసనాలకు బానిసలు కాలేదు, ఇది కేవలం వాతావరణ , భౌగోళిక ప్రభావం వల్ల వచ్చిన అలవాటు.

**నెత్తురోడుతున్న లాటిన్ అమెరికా , ముఠాల ఆధిపత్యం**

హత్యలు, డ్రగ్స్ స్మగ్లింగ్ గురించి మాట్లాడుకుంటే లాటిన్ అమెరికా దేశాల పేర్లు ముందు వరసలో వినిపిస్తాయి. పాబ్లో ఎస్కోబార్, ఎల్ చాపో గుజ్మాన్ లాంటి క్రూరమైన మాఫియా డాన్లు ఉద్భవించడానికి కారణం మతం కాదు, లక్షల కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం మరియు అగ్రరాజ్యాల మార్కెట్ డిమాండ్. యు యెన్ ఓ డి సి నివేదికల ఆధారంగా హత్యల రేటును పరిశీలిస్తే, ప్రపంచవ్యాప్తంగా సగటు హత్యల రేటు ప్రతి లక్ష మందికి 6.1 ఉంటే, లాటిన్ అమెరికా దేశాల్లో ఇది భయంకరంగా ఉంది. హోండురాస్‌లో ప్రతి లక్ష మందికి సుమారు 35 నుండి 40 హత్యలు జరుగుతుండగా, వెనిజులాలో సుమారు 40 నుండి 50 హత్యలు నమోదవుతున్నాయి.

ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం ప్రపంచ అక్రమ డ్రగ్స్ మార్కెvట్ వార్షిక విలువ సుమారు $400 నుండి $600 బిలియన్ల వరకు ఉంటుంది. ఈ నిధులతోనే గ్యాంగ్స్ విపరీతంగా విస్తరిస్తున్నాయి. ఎల్ సాల్వడార్‌కు చెందిన 'మారా సాల్వాట్రూచా' గ్యాంగ్‌లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 50,000 నుండి 70,000 మంది సభ్యులు ఉండగా, జపాన్‌కు చెందిన 'యాకూజా' ఒకప్పుడు ఏకంగా 80,000 మంది సభ్యులతో ప్రభుత్వాన్నే శాసించింది. అమెరికా లాంటి అగ్రరాజ్యాల్లో ఉన్న విపరీతమైన డ్రగ్స్ డిమాండ్, ఈ దేశాల్లోని తీవ్రమైన నిరుద్యోగం, అవినీతి ఈ నేర సామ్రాజ్యాలకు పునాదిగా మారుతున్నాయి.

**నిజమైన సామాజిక మార్పు దిశగా**

ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్న ఒకే ఒక వాస్తవం ఏంటంటే, నేరాలు, వ్యసనాలు, తీవ్రవాదం అనేవి ఏ ఒక్క ప్రాంతానికో, మతానికో పరిమితమైనవి కావు. ఇవి మానవ సమాజంలో ఏర్పడిన భయంకరమైన అసమానతలు, వ్యవస్థాగత లోపాలు మరియు అధికార దాహానికి సజీవ సాక్ష్యాలు. ఒక వర్గాన్ని లేదా ఒక మతాన్ని ఈ నేరాలతో ముడిపెడుతూ అంచనాలు వేయడం ద్వారా అసలైన నేరస్థులను, వ్యవస్థాగత లోపాలను మనం రక్షిస్తున్నట్లే అవుతుంది.

**ఉగ్రవాద భూతం , భౌగోళిక రాజకీయాల నెత్తుటి క్రీడ**

ఇస్లామిక్ స్టేట్ , అల్‌ఖైదా, తాలిబన్, బోకో హరామ్ లాంటి సంస్థలు సృష్టిస్తున్న విధ్వంసం వర్ణనాతీతం. పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాల్లో దశాబ్దాలుగా నెలకొన్న రాజకీయ శూన్యత, చమురు వనరుల కోసం జరిగిన పోరాటాలే ఈ సంస్థల ఆవిర్భావానికి దారితీశాయి. మతం ముసుగులో వారు సాగిస్తున్న క్రీడలో బలవుతున్నది సామాన్యులే. గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ వాస్తవ గణాంకాల ప్రకారం, ఉగ్రవాద దాడుల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో 80 శాతానికి పైగా ముస్లింలే ఉన్నారు. ముఖ్యంగా ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, సిరియా, సోమాలియా లాంటి దేశాల్లో ఈ మరణాలు అత్యధికంగా ఉన్నాయి. దీనిని బట్టి ఉగ్రవాదానికి మతం లేదని, అది కేవలం ఒక ఆధిపత్య పోరు అని స్పష్టమవుతుంది.

వీరి ఆర్థిక మూలాలను పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన నిజాలు తెలుస్తాయి. 201415లో అత్యున్నత దశలో ఉన్నప్పుడు, ఐఎస్ఐఎస్ ఉగ్రవాద సంస్థ చమురు అక్రమ రవాణా, కిడ్నాప్‌లు మరియు దోపిడీల ద్వారా ఏటా సుమారు $2 బిలియన్లు (సుమారు 16 వేల కోట్ల రూపాయలు) ఆర్జించింది. ఇది మత విశ్వాసంతో కాకుండా పక్కా కార్పొరేట్ తరహాలో జరిగిన ఆర్థిక దోపిడీ అని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

సమాజాన్ని మేల్కొల్పాల్సిన బాధ్యత కలిగిన ప్రజలు ఇలాంటి గణాంకాల వెనుక ఉన్న ఆర్థిక, భౌగోళిక , రాజకీయ వాస్తవాలను అర్థం చేసుకోవాలి. విద్యా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం, ఆర్థిక అసమానతలను తగ్గించడం ద్వారా మాత్రమే ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. అప్పుడే నిజమైన సామాజిక మార్పు సాధ్యమవుతుంది.

**( గడల నరసింహారావు, సీనియర్ జర్నలిస్ట్ )**

---



# జనగళానికి జైకొట్టిన సర్కార్

- **ప్రజా పాలనలో సరికొత్త విప్లవం.**
- **ఇక మీ ఊరిలోనే ప్రజావాణి!**

**హైదరాబాద్, మహా.**

పాలనను చివరి ప్రాజెక్టు వరకు, ప్రతి సామాన్యుడి గుమ్మం ముందుకు తీసుకురావడంలో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు కేవలం జిల్లా కలెక్టరేట్లు లేదా రాష్ట్ర రాజధానికి మాత్రమే పరిమితమైన "ప్రజావాణి" ఫిర్యాదుల వేదికను, ఇకపై నేరుగా మండల స్థాయికి విస్తరిస్తూ ప్రభుత్వం అత్యంత సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. సామాన్యుడి ఆర్తిని వినడానికి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి ఎంపీడీవో కార్యాలయాలే ప్రధాన వేదికగా మారబోతున్నాయి. ప్రతి సోమవారం ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒకటి గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమం, గ్రామీణ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే గొప్ప ప్రజాస్వామ్య విప్లవంగా నిలవనుంది.

సామాన్యుడి కష్టాలకు శాశ్వత పరిష్కారం

ఈ సంచలన నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మంది సామాన్య, నిరుపేద ప్రజలకు అపారమైన ప్రయోజనం చేకూరనుంది. గతంలో ఒక చిన్న సమస్య పరిష్కారం కోసం లేదా అర్జీ సమర్పించడం కోసం సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రాలకు రావాల్సి వచ్చేది. దీనివల్ల నిరుపేదలకు ఒక రోజు కూలీ పోవడంతో పాటు రవాణా ఖర్చులు తీవ్ర భారంగా మారేవి. ఇప్పుడు ఆ తిప్పలన్నీ పూర్తిగా తప్పుతాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు జిల్లా కేంద్రాలకు ప్రయాణించే శ్రమ తప్పడమే కాకుండా, రాకపోకల ఖర్చులు ఆదా అవుతాయి.

రవాణా ఇబ్బందులు పడే వృద్ధులు, దివ్యాంగులు, ొగర్భిణులు మరియు మహిళలు తమ స్వంత మండలంలోనే అధికారులను నేరుగా కలసి తమ ఆవేదనను విన్నవించుకోవచ్చు. మండల స్థాయిలోనే రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్, పోలీసు, వ్యవసాయ, సంక్షేమ శాఖల అధికారులు ఒకే వేదికపై అందుబాటులో ఉంటారు. దీనివల్ల సమస్యల తీవ్రతను తక్షణమే అధికారులు గుర్తించి స్పందించే అవకాశం లభిస్తుంది.

పింఛన్లు, రేషన్ కార్డులు, భూ సమస్యలు, డ్రైనేజీ, తాగునీరు వంటి స్థానిక మౌలిక వసతుల సమస్యలు క్షణాల్లో అధికారుల దృష్టికి వెళ్తాయి. అంతేకాకుండా తమ అర్జీల పురోగతిని ప్రతి వారం తెలుసుకోవడం స్థానిక ప్రజలకు ఎంతో సులభతరం అవుతుంది. అధికారులు నేరుగా ప్రజలతో మమేకం కావడం వల్ల ప్రభుత్వ యంత్రాంగంలో బాధ్యత, పారదర్శకత గణనీయంగా పెరుగుతాయి. ప్రతి ప్రతిపాదనను క్షేత్రస్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ వేదిక ఒక గొప్ప వారధిగా నిలుస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనల నీరాజనం

ప్రజా పాలనకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచేలా ఈ విప్లవాత్మక సంస్కరణను ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం నిజంగా అభినందనీయం మరియు అత్యంత ప్రశంసనీయం. పాలనలో పారదర్శకతను పెంచడానికి, జవాబుదారీతనాన్ని నెలకొల్పడానికి మరియు అధికార యంత్రాంగాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక చారిత్రాత్మక ఘట్టం. క్షేత్రస్థాయి ప్రజల కష్టాలను స్వయంగా గుర్తించి, వారి గొంతుకకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ మండల స్థాయికి ప్రజావాణిని విస్తరించడం ప్రభుత్వ సంక్షేమ దృక్పథానికి నిదర్శనం. ప్రతి సోమవారాన్ని ప్రజల సమస్యల పరిష్కార పండుగగా మారుస్తూ, సామాన్యుడి చేతికి ప్రజాస్వామ్య ఫలాలను నేరుగా అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధి, కార్యదీక్ష మరియు దూరదృష్టి నిజంగా అద్భుతం, వర్ణనాతీతం! పారదర్శక పాలన అందించడంలో ఈ ప్రభుత్వం నిలబెట్టిన ప్రమాణాలు రాబోయే తరాలకు దిశానిర్దేశం చేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

---

# ట్రంప్ దౌత్యానికి నెతన్యాహు అడ్డుకట్ట

దశాబ్దాలుగా మధ్యప్రాచ్యాన్ని అట్టుడికిస్తున్న గాజా సంక్షోభానికి తెరదించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరపైకి తెచ్చిన 'బోర్డ్ ఆఫ్ పీస్' శాంతి ప్రణాళిక ప్రస్తుతం ప్రపంచ రాజకీయాల్లో అత్యంత చర్చనీయాంశమైంది. గాజా రణరంగంలో మూడేళ్లుగా సాగుతున్న వినాశకరమైన పోరుకు ముగింపు పలకాలని, అక్కడ విధ్వంసానికి గురైన ప్రాంతాలను పునర్నిర్మించాలని అంతర్జాతీయ సమాజం భావిస్తున్న తరుణంలో ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు తీసుకున్న వైఖరి ఊహించని పరిణామాలకు దారితీసింది. అమెరికా రచిస్తున్న నూతన శాంతి రూపకల్పనకు, ఇజ్రాయెల్ జాతీయ భద్రతా వ్యూహాలకు మధ్య పొసగని ఈ ధోరణులు అంతర్జాతీయ దౌత్యంలో నూతన సంక్లిష్టతలను సృష్టిస్తున్నాయి.

గాజాలో శాంతి స్థాపనే లక్ష్యంగా అమెరికా ప్రత్యేక బృందం, బోర్డ్ ఆఫ్ పీస్ ప్రధాన ప్రతినిధి నికోలే మ్లాడెనోవ్ నేతృత్వంలో జెరూసలేంలో కీలక చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో గాజా పునర్నిర్మాణ దశకు సంబంధించిన ప్రణాళికలను అమెరికా పక్షం ప్రతిపాదించగా, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వాటిని బహిరంగంగానే విభేదించారు. గాజాలో శాంతి చర్చలు లేదా పునరుద్ధరణ పనులు ప్రారంభం కావడానికి ముందే హమాస్ ఉగ్రవాదులు సంపూర్ణంగా ఆయుధాలు కిందపెట్టాలని ఇజ్రాయెల్ ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఉగ్రవాద మూలాలు పూర్తిగా నిర్మూలించబడకుండా, కేవలం తాత్కాలిక ఒప్పందాలతో శాంతిని సాధించడం అసాధ్యమని ఇజ్రాయెల్ బలంగా వాదిస్తోంది. ఈ కఠిన వైఖరి ద్వారా, దేశ భద్రత విషయంలో మిత్రదేశమైన అమెరికా ఒత్తిళ్లకు కూడా తలవంచేది లేదనే సంకేతాలను నెతన్యాహు స్పష్టంగా పంపారు. మరోవైపు, హమాస్ సైతం ఆయుధాలు వదిలేందుకు సిద్ధమంటూ చేస్తున్న ప్రకటనలు కేవలం దౌత్యపరమైన ఎత్తుగడలేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు శత్రువు నుంచి వస్తున్న సంసిద్ధతను స్వాగతించాలనే కోణంలో అమెరికా మరియు ఇతర పాశ్చాత్య దేశాలు ప్రయత్నిస్తుంటే, మరోవైపు అదే శత్రువు భవిష్యత్తులోనూ ముప్పుగా మారవచ్చనే ఆందోళనతో ఇజ్రాయెల్ సంపూర్ణ నిరాయుధీకరణ కోరుతోంది. ఈ రెండు భిన్నమైన ధ్రువాల మధ్య నడుస్తున్న ఈ ఘర్షణ కేవలం గాజా భవితవ్యాన్ని మాత్రమే కాకుండా, అమెరికాఇజ్రాయెల్ వ్యూహాత్మక సంబంధాలను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది.

మధ్యప్రాచ్యంలో శాశ్వత శాంతి అనేది కేవలం కాగితాలపై రాసే ఒప్పందాలతో సాధ్యం కాదని, అది క్షేత్రస్థాయిలో ఉండే వాస్తవాలు మరియు భద్రతా సవాళ్లతో ముడిపడి ఉంటుందని ఈ పరిణామాలు మరోసారి రుజువు చేస్తున్నాయి. బోర్డ్ ఆఫ్ పీస్ ప్రతిపాదనలను ఇజ్రాయెల్ తోసిపుచ్చిన నేపథ్యంలో, రాబోయే రోజుల్లో ఈ దౌత్యపరమైన ప్రతిష్టంభన ఎలా వీడుతుంది, అమెరికా తన ప్రణాళికను అమలు చేయడానికి ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తుంది అనేది కాలమే నిర్ణయించాలి. శాంతి కోసం జరుగుతున్న ఈ ప్రయత్నాలు ఒక సార్థకమైన ముగింపునకు చేరుకుంటాయా, లేక మరో పెద్ద ఉద్రిక్తతకు నాంది పల్కుతాయా అనేది అంతర్జాతీయ రాజకీయ పరిశీలకులను వేధిస్తున్న ప్రధాన ప్రశ్న.






# ఈనెల 6న సీపీఎం నాయకులు కామ్రేడ్ రాసాల వెంకటేష్ స్థూపావిష్కరణ

- **బహిరంగ సభకు రానున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ.**

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 4 మహా :** సీపీఎం సీనియర్ నాయకులు, రైతు సంఘం మాజీ డివిజన్ కార్యదర్శి, బస్వాపురం గ్రామ మాజీ సర్పంచ్ కామ్రేడ్ రాసాల వెంకటేష్ వర్ధంతి పురస్కరించుకుని ఈనెల 6వ తేదీన బస్వాపురం గ్రామంలో నిర్మించిన స్థూప అవిష్కరణకు బహిరంగ సభకు ముఖ్యఅతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరవుతున్నారని రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా తెలిపారు.భువనగిరి సుందరయ్య భవన్లో సీపీఎం భువనగిరి మండల కమిటీ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతు కామ్రేడ్ రాసాల వెంకటేష్ ఎర్రజెండా నాయకత్వంలో బతికినంత కాలం పేద ప్రజల హక్కుల కోసం పోరాడారని తెలిపారు. ప్రధానంగా రైతాంగము, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై అనేక ఉద్యమాలు నడిపాడరన్నారు. గ్రామ సర్పంచిగా గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారన్నారు.ప్రాజెక్టు విషయంలో, నిర్వాసితుల విషయంలో, రైతులకు మార్కెట్ సౌకర్యం కోసం పోరాడారని తెలిపారు. సీపీఎం తీసుకున్న ప్రతి ఉద్యమంలో వారి పాత్ర చాలా గొప్పదన్నారు. అలాంటి నాయకుడు ప్రజల మధ్యన లేకపోవడం ప్రజా ఉద్యమాలకు లోటన్నారు. వారి ఆశయాలను కొనసాగించడానికి వారిని స్మరించుకోవడానికి వారి యొక్క స్మారక స్థూపాన్ని గ్రామంలో నిర్మాణం చేయడం జరిగిందన్నారు. వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈనెల ఆరవ తేదీన స్థూపావిష్కరణతో పాటు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న రైతులు వ్యవసాయ కూలీలు, కార్మికులు వృత్తిదారులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సభలో రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తో పాటు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్, జిల్లా నాయకత్వం పాల్గొని ప్రసంగిస్తారని, ప్రజానాట్యమండలి కళాకారుల కళారూపాలు ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు అన్నంపట్ల కృష్ణా, కమిటి సభ్యులు పాండాల మైసయ్య, కొండపురం యాదగిరి పాల్గొన్నారు.

# సమాజ హితానికి ఉపయోగపడే పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి..

- **చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ డైరెక్టర్ అండ్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్. సాత్విక రెడ్డి**




**మొయినాబాద్ మహా:** సమాజ హితానికి ఉపయోగపడే పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ డైరెక్టర్ అండ్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్. సాత్విక రెడ్డి పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ లోగల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో బయోటెక్నాలజీ విభాగంలో " ఇన్వెస్టిగేషన్స్ ఆన్ ప్లాంట్ గ్రోత్ ప్రమోషన్ అండ్ బయోకంట్రోల్ పోటెన్సియల్ ఆఫ్ బ్యాక్టీరియా ఐసోలేటెడ్ ఫ్రామ్ రైజోస్పియర్ సాయిల్ అండ్ థేయిర్ ఇంపాక్ట్ ఆన్ రూట్ క్రాప్స్" అనే పరిశోధన సిద్ధాంతానికి కొండ జాహ్నవికి పీహెచ్.డీ డిగ్రీ పట్టా లభించింది. ఈ పరిశోధన డాక్టర్ వి. శ్రీలేఖ పర్యవేక్షణలో పూర్తి చేసి ఆమె ఈ ఘనత సాధించారు. యూనివర్సిటీ డైరెక్టర్ అండ్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్. సాత్విక రెడ్డి చేతుల మీదగా ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజ హితానికి ఉపయోగపడే పరిశోధనలు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. జీవ సాంకేతిక శాస్త్రంలో జరుగుతున్న పరిశోధనలు జాతీయ అభివృద్ధికి కీలకంగా మారుతున్నాయని తెలిపారు. రైజోస్ఫియర్ నేల నుండి వేరు చేయబడిన బ్యాక్టీరియా యొక్క మొక్కల పెరుగుదల ప్రోత్సాహం, జీవ నియంత్రణ సాసామర్థ్యంపై పరిశోధన మరియు దుంప పంటలపై వాటి ప్రభావం గురించి వాస్తవ ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని అన్నారు. ఈ విజయం జీవ సాంకేతిక శాస్త్రం విభాగానికి గర్వ కారణమని, శాస్త్రీయ అవగాహనతో పాటు సమాజ శ్రేయస్సు పెంపొందించి పరిశోధనలకు యూనివర్సిటీ నిరంతరం ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ ఆచార్య ఎం.రవీందర్, డీన్ రీసెర్చ్ డెవలప్మెంట్ ఆచార్య ఏ.రాజు, బి రాజేందర్ రెడ్డి, ఈ.జగదీష్ కుమార్, టి.మురళీకృష్ణ, అసిస్టెంట్ రిజిస్టర్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు



# ఉండాడి వెంకన్న మరణం బాధాకరం

- **చిరుమర్తి లింగయ్య మాజీ శాసనసభ్యులు**

**భువనగిరి ఆగస్టు 4 మహా న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం పరిధిలోని మునిపంపుల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు ఉండాడి వెంకన్న మృతి చెందడం బాధాకరమని నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య అన్నారు మంగళవారం వెంకన్న పార్థివ దేహం పై పుష్పగుచ్చం పెట్టి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



# పలారం బండి ఊరేగింపు

**పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి**

**కుషాయిగూడ, మహా :** బోనాల ఉత్సవాల్లో భాగంగా గాంధీనగర్‌లో నిర్వహించిన పలారం బండి ఊరేగింపులో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా బోనాల ఉత్సవాల్లో భక్తులతో కలిసి పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో కాప్రా మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, సీతారాం రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శ్రీహరి, టీలు యాదవ్, ప్రకాష్ రెడ్డి, సీనియర్ నాయకులు నగశేషు, నాగరాజు, మల్లారెడ్డి, బాబురావు, రాకేష్, పూర్ణ యాదవ్, పవన్, లింగం, అజీజ్, శివ, సురేందర్ రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# 1.16 కోట్లతో డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



**కుషాయిగూడ, మహా :** హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్, కృష్ణానగర్, తిరుమలనగర్ కాలనీల్లో రూ.1.16 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బాక్స్ డ్రైన్, భూగర్భ మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం శ్రీకారం చుట్టారు. మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డితో కలిసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అవసరమైన పనులను దశలవారీగా చేపడుతున్నామని చెప్పారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రతి కాలనీలో అవసరమైన అభివృద్ధి పనులు కొనసాగుతాయని బండారు పేర్కొన్నారు. అనంతరం స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే, పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.మాజీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యే అందిస్తున్న సహకారం అభినందనీయమని చెప్పారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మాజీ కార్పొరేటర్ గుండారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి. వరదల్లో డ్రైనేజీ నిల్వ ఉండకుండా ముందస్తుగానే చర్యలు తీసుకున్నందుకు అభినందిస్తున్నామన్నారు.ఈ పనుల్లో లక్ష్మీనగర్ నుంచి ఇంద్రనగర్ ఫేజ్-2 వరకు బాక్స్ డ్రైన్ నిర్మాణం, తిరుమలనగర్ జేఎన్‌టీ పాయింట్ సమీపంలో భూగర్భ మురుగునీటి కాలువ నిర్మాణం, కృష్ణానగర్ రోడ్ నెం.9లో బాక్స్ డ్రైన్ నిర్మాణం చేపట్టనున్నారు.కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారులు, స్థానిక నాయకులు, వంజరి ప్రవీణ్ కరిపే కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు ఆయా కాలనీ వాసులు ఘన స్వాగతం పలికారు.




# క్యాతనపల్లిలో కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్..

**రగులుతున్న రాజకీయ వేడి..**

**క్యాతనపల్లిమహా :** క్యాతనపల్లి మున్సిపాలిటీ రాజకీయాలు ప్రస్తుతం కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్ పార్టీలకు వేదికగా మారాయి. ప్రతి అంశంపై ఇరు పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటూ రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. మున్సిపల్ పాలన, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై కాంగ్రెస్ తన ప్రభుత్వ పనితీరును సమర్థించుకుంటుండగా, బిఆర్ఎస్ మాత్రం హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తోంది. ఇటీవల స్థానికంగా జరిగిన రాజకీయ పరిణామాలు, సమావేశాలు, మీడియా సమావేశాల్లో ఇరు పార్టీల నాయకులు ఘాటు వ్యాఖ్యలు చేసుకోవడంతో రాజకీయ చర్చ మరింత ఊపందుకుంది. కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో క్యాతనపల్లి అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని చెబుతున్నారు. మరోవైపు బిఆర్ఎస్ నాయకులు రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, మౌలిక వసతుల వంటి సమస్యలను ప్రస్తావిస్తూ అధికార పార్టీపై విమర్శలు గుప్పిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా కూడా ఇరు పార్టీల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతుండగా, స్థానిక ప్రజా సమస్యలు రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా మారాయి. వార్డులు, కాలనీల్లో ప్రజలతో మమేకమవుతూ తమ బలాన్ని పెంచుకునేందుకు రెండు పార్టీల నాయకులు ప్రయత్నాలు చేస్తున్నాయి. రానున్న రెండేళ్లలో జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇరు పార్టీలూ రాజకీయంగా పట్టు సాధించేందుకు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే చివరకు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే పార్టీనే ప్రజలు విశ్వసిస్తారనేది జగమెరిగిన సత్యం.



# క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్‌పై బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు

**క్యాతనపల్లి మహా:** క్యాతనపల్లి మున్సిపాలిటీలో రాజకీయ వివాదం మరింత ముదిరింది. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ వ్యవహారశైలిపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆరోపణలు చేస్తూ మంగళవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ రాజా రమేష్ మాట్లాడుతూ, కమిషనర్ మురళీకృష్ణ ప్రజలను, ప్రజాప్రతినిధులను, మున్సిపల్ అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఆమోదించిన తీర్మానాలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, అధికారులకు మెమోలు జారీ చేస్తూ వారిని ఒత్తిడికి గురిచేస్తున్నారని విమర్శించారు. గతంలో కమిషనర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలను ప్రస్తావించిన ఆయన, వెంటనే కమిషనర్‌ను బదిలీ చేసి ప్రజలకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే తమ ఫిర్యాదులపై పోలీసులు స్పందించడం లేదని ఆరోపించిన రాజా రమేష్, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయించి పార్టీ లీగల్ సెల్ ద్వారా న్యాయపోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి బెదిరింపులకు భయపడకుండా తమ సమస్యలను మున్సిపల్ చైర్‌పర్సన్, పోలీసు శాఖ లేదా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు కంభగోని సుదర్శన్ గౌడ్, పలువురు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వన మహోత్సవంలో మొక్కలు నాటిన బండారి లక్ష్మారెడ్డి

- **ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ఆ పర్యావరణాన్ని పరిరక్షించాలి**

**కుషాయిగూడ, మహా :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్ రాధికా గుప్తాతో కలిసి మొక్కలు నాటిన ఎమ్మెల్యే ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ కూడా అందరి బాధ్యత అని చెప్పారు. భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే పచ్చదనం పెంపుపై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.నగరాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మున్సిపల్ విభాగాల్లో సిబ్బంది పెంపునకు

**బిజెపి నేత సురేష్ వినతి**

**కుషాయిగూడ, మహా :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని విభాగాల్లో సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరుతూ సామాజిక కార్యకర్త అక్కల సురేష్ కుమార్ మంగళవారం మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి, ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులపై అధిక పనిభారం పడుతోందని, తగిన సంఖ్యలో కొత్త ఉద్యోగులను నియమిస్తే సిబ్బందిపై ఒత్తిడి తగ్గడంతో పాటు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను వేగంగా పరిష్కరించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన, పారదర్శకమైన మున్సిపల్ సేవలు అందించాలంటే అన్ని విభాగాల్లో అవసరమైన సిబ్బందిని తక్షణమే నియమించాలని ప్రభుత్వం, సంబంధిత అధికారులను ఆయన కోరారు.



# మత్తుకు దూరంగా ఉండండి..

**ఆరోగ్యాన్ని కాపాడుకోండి**

**నశా ముక్త్ భారత్ అభియాన్ లో కలెక్టర్ ,మున్సిపల్ చైర్ పర్సన్ సూచనలు**

**ఆదిలాబాద్ మహా :** ఆరోగ్యకరమైన యువతే తెలంగాణ రైజింగ్, వికసిత్ భారత్‌కు అసలైన బలమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణం లోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం లో నిర్వహించిన నశా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి ఆయన మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి హాజరయ్యారు. దేశవ్యాప్తంగా బ్రహ్మకుమారీస్ చేపట్టిన 10 కోట్ల మంది వ్యసనముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాలంటే కేవలం గంజాయి, కొకైన్ మాత్రమే కాదని, మద్యం, పొగాకు, జర్దా వంటి చిన్న అలవాట్లు కూడా తీవ్ర వ్యసనాలుగా మారి జీవితాన్ని నాశనం చేస్తాయని హెచ్చరించారు. ప్రస్తుత కాలంలో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, మొబైల్ ఫోన్ల అతిగా వాడకం వంటి డిజిటల్ వ్యసనాలు కూడా యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ పేర్కొన్న సామాజిక పాపాలను గుర్తు చేస్తూ.. విద్యతో పాటు విలువలు, వ్యక్తిత్వ వికాసం ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. విద్యార్థులు ఉదయాన్నే లేవడం, యోగా, ధ్యానం వంటి మంచి దినచర్యలను అలవర్చుకోవాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యసన విముక్తిపై అవగాహన కల్పించేందుకు ప్రతి గురువారం 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఈ ప్రతిజ్ఞ కార్యక్రమం రానున్న 15 రోజుల పాటు విస్తృతంగా కొనసాగుతుందని తెలిపారు. వ్యసనాలకు దూరంగా ఉండటమే ఆరోగ్యవంతమైన జీవితానికి పునాది అని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నారు. చెడు అలవాట్లు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక స్థైర్యాన్ని, ఆలోచనా విధానాన్ని దెబ్బతీస్తాయని చెప్పారు. ప్రస్తుత యువత వ్యసనాల బారిన పడి ఆవేశానికి, కోపానికి లోనవుతున్నారని, ఇది కుటుంబ సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, పెద్దలను గౌరవిస్తూ, సంయమనంతో ప్రవర్తించాలని కోరారు.అనంతరం నశా ముక్త్ భారత్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో డీఈవో మాధవి, డిఐఈఓ గణేష్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ రామాయ్య, బ్రహ్మకుమారి నిర్వాహకులు రేవతి, దిల్ రెడ్డి, లెక్రాజ్, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర పుస్తకం పై మాస్టర్ ట్రైనర్ గా లెక్చరర్ తమ్మిశెట్టి శ్రీనివాస్

**కారేపల్లి, మహా:** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చరిత్ర పుస్తకంపై రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల హిస్టరీ లెక్చరర్ తమ్మిశెట్టి శ్రీనివాస్ ను మాస్టర్ ట్రైనర్ గా ఇంటర్మీడియట్ బోర్డు ఎంపిక చేసింది. హైదరాబాద్ లోని ఇంటర్మీడియట్ బోర్డు లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇవ్వనున్నారు. మారిన చరిత్ర పుస్తకం పై రాష్ట్రస్థాయిలో హిస్టరీ లెక్చరర్లకు ట్రైనింగ్ ఇచ్చేందుకు శ్రీనివాస్ ను ఎంపిక చేయడం పట్ల కారేపల్లి కళాశాల, అధ్యాపక బృందం, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# రిమ్స్ ను సందర్శించిన ఐటీడీఏ పీవో

- **గిరిజనులకు అందుతున్న వైద్య సేవల పరిశీలన**



**ఆదిలాబాద్ మహా :** గిరిజనులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు ఆదేశించారు.మంగళవారం ఆయన ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రిని సందర్శించి గిరిజనులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వివిధ వార్డులను సందర్శించి చికిత్స పొందుతున్న గిరిజన రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి రోగికి అవసరమైన చికిత్సను సకాలంలో అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు.వార్డుల్లో నిర్వహిస్తున్న గిరిజన రోగుల రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించిన ప్రాజెక్టు అధికారి.. రోగుల నమోదు, చికిత్స వివరాలు, మందుల పంపిణీ, వైద్య సేవల పురోగతిని ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ప్రతి రోగి పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న సేవల నాణ్యతను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు.అనంతరం ఆదిలాబాద్‌లోని గిరిజన సహకార సంస్థ గోదాములను సందర్శించిన ప్రాజెక్టు అధికారి, అటవీ ఉత్పత్తులు, ఇతర వస్తువుల నిల్వ విధానం, స్టాక్ రిజిస్టర్లు, భద్రతా ఏర్పాట్లు, గోదాముల నిర్వహణను తనిఖీ చేశారు. నిల్వల వివరాలను పారదర్శకంగా నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు.గిరిజన సంక్షేమానికి సంబంధించిన అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు ప్రతి గిరిజన కుటుంబానికి చేరేలా కృషి చేయాలని పివో సూచించారు.ఈ తనిఖీల్లో రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కుడిమేత మనోహర్, రిమ్స్ వైద్యులు, గిరిజన సహకార సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర ప్రభుత్వ దగా కోరు పాలనలో జనజీవనం అస్తవ్యస్తం

**బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదాం**

**కుషాయిగూడ, మహా :** కేంద్ర ప్రభుత్వ దగా కోరు పాలనలో జనజీవనం అస్తవ్యస్తమవుతుందని, పేపర్ లీకేజీలు కార్మికుల హక్కులను పరిరక్షించడంలో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తుందని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోటపల్లి శంకర్ దుయ్యబట్టారు. "బదలవ్ జురారీ హై" కార్యక్రమానికి పురస్కరించుకొని సిపిఐ కాప్రా మండల కార్యదర్శి యాదగిరి ఆధ్వర్యంలో మంగళవారం సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ సమక్షంలో చలో ఢిల్లీ గోడ పత్రికను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ దేశంలోని గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం కుంటు పడుతుందని తీవ్ర సంక్షోభంలో రైతులు ఉన్నారని కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపు తేనే దేశంలో మార్పు వస్తుందన్నారు .అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు చలో ఢిల్లీ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈనెల 6 నుండి పాదయాత్రలు నిర్వహించి బిజెపి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహ, వెంకటాచారి, స్వరూప్ నాయక్, ఎల్లయ్య, అశోక్ చారి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు ఎమిరేట్స్ కార్గో సేవలు

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి త్తేపే, హైదరాబాద్, దుబాయ్ మార్గంలో ఎమిరేట్స్ స్కై కార్గో ప్రత్యేక బోయింగ్ 777 ఫైటర్ విమాన సేవలను జిఎంఆర్ హైదరాబాద్ సంస్థ ప్రారంభించింది.ఈ సేవతో హైదరాబాద్ విమానాశ్రయం భారతదేశంలోని ప్రముఖ వైమానిక కార్గో కేంద్రాలో తన స్థానాన్ని పదిలం చేసుకుంది.100 టన్నులకు పైగా కార్గో మోసుకెళ్లగల సామర్థ్యం దీర్ఘ దూర కార్యకలాపాల సామర్థ్యంతో కూడిన బోయింగ్ 777 ఫ్రైటర్, తైపే-హైదరాబాద్-దుబాయ్ వ్యూహాత్మక కారిడార్‌లో సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచుతుంది. ఈ సేవ ద్వారా ఔషధాలు, లైఫ్ సైన్సెస్ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, త్వరగా పాడయ్యే వస్తువులు, ఎక్స్‌ప్రెస్ కార్గో వంటి అధిక విలువ కలిగిన, సమయానుకూలంగా చేరాల్సిన సరుకుల రవాణా సులభతరం చేస్తుంది.



## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- ఓటర్లతో సమన్వయం చేసుకుంటూ ప్రక్రియ పూర్తి చేయాలి
- ఎట్టిపరిస్థితుల్లో పేదల ఓట్లు తొలగించకుండా జాగ్రత్తపడాలి..
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి...
- 'బీ' బ్లాక్ బీఎల్ఏలు, సూపర్ వైజర్లు, పార్టీ నేతలకు దిశానిర్దేశం...

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 4 మహా:** సమగ్ర ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్‌సర్) ప్రక్రియను క్షేత్రస్థాయిలో మరింత సీరియస్‌గా తీసుకుని పనిచేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సూచించారు. నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ నేతలతో వరుస సమీక్షలు జరుపుతున్న ఆయన... సోమవారం 'ఏ' బ్లాక్ నేతలతో సమావేశం కాగా.. మంగళవారం 'బీ' బ్లాక్ నాయకులతో సమీక్ష నిర్వహించారు. 'బీ' బ్లాక్ పరిధిలోని అబ్దుల్లాపూర్ మెట్ మండలం, తుర్కయంజాల్, తొర్రూర్, పెద్దఅంబర్ పేట్, కుంట్లూర్ డివిజన్లకు చెందిన బీఎల్ఏలు, సూపర్ వైజర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో తొర్రూర్ లోని క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఎస్ఐఆర్ గడువు పొడిగింపు నేపథ్యంలో ఇప్పటివరకు చేసిన కసరత్తు, ఫలితాలు, క్షేత్రస్థాయి వాస్తవాలను చర్చించారు. ఎస్ఐఆర్ పై పీసీసీ ప్రత్యేకంగా నియమించిన చైతన్యరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఈ సందర్భంగా పలుసూచనలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పేదల, బడుగు, బలహీనవర్గాల ఓట్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని నిర్దేశించారు. పార్టీ ఓటర్లను కాపాడటంలో విఫలమైతే ఏ హోదాలో ఉన్నవారిపైనైనా ఉపేక్షించేది లేదని, చర్యలకు పార్టీ అధిష్ఠానం హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో... ఎక్కడ కూడా నిర్లక్ష్యధోరణి ప్రదర్శించవద్దని చెప్పారు. కిందిస్థాయి వరకు అందరూ ఓట్లు కాపాడుకోవడంపైనే దృష్టి సారించాలని తెలిపారు. ఓటర్లతో సమన్వయం చేసుకొని గడువు లోగా ప్రక్రియ పారదర్శకంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ కోసం బూత్ లెవెల్ అధికారులకు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. బిఎల్ఏలు బూతుల వారీగా సమన్వయం చేసుకొని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, నేతలు కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.



## అమ్మవారిని దర్శించుకున్న బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్, కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్ మహా ;** బోనాల పండగ సందర్భంగా మంగళవారం కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలో రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జ్ కార్తీక్ రెడ్డి వివిధ కాలనీలోని దేవాలయాలను సందర్శించి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఘటాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల భక్తి భావానికి బోనాల పండుగ నిదర్శనం. అమ్మవారి చల్లని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరి పై ఉండాలన్నారు. నియోజకవర్గ ప్రజలందరు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు గుమ్మడి కుమార్, రమేష్ ముదిరాజ్, రాము యాదవ్, రాఘవేందర్ యాదవ్, రాజేష్ యాదవ్, ఉప్పల్ శ్రీను, ప్రవీణ్, మైసిరెడ్డి,వెంకటరమణ, సునీల్, మహేష్, సమ్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి,అఖిల్ తదితరులు పాల్గొన్నారు..

## పీకే ఓసీ–2 డీప్‌సైడ్ గని సింగరేణిదే...

- కార్మికులు, నేతల విజయోత్సవ సంబురాలు...
- కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే..
- క్యాంటీన్‌లో కార్మికులతో పాటు అల్పాహారం..
- ఉపాధి భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది..
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..



**మణుగూరు, మహా :** పీకేఓసీ-2 డీప్‌సైడ్ బొగ్గు గనిని సింగరేణి సంస్థకు కేటాయించడంతో వేలాది మంది కార్మికుల ఉద్యోగ భద్రతకు భరోసా లభించిందని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ నిర్ణయాన్ని పురస్కరించుకుని మణుగూరు మండలంలోని పీకేఓసీ-2 ప్రాజెక్టులో మంగళవారం నిర్వహించిన పిట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్మికులతో కలిసి విజయోత్సవ సంబురాలలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే పాయం పాల్గొని మాట్లాడారు. పీకేఓసీ-2 డీప్ సైడ్ గని ని సింగరేణికి దక్కించేందుకు కార్మిక సంఘాలు, ప్రజాప్రతినిధులు, ప్రజలతో కలిసి నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన కృషి ఫలితమే ఈ నిర్ణయమన్నారు. ఈ గని సింగరేణికి రావడం ద్వారా సంస్థ మరింత బలోపేతం కావడంతో పాటు వేలాది మంది కార్మికుల ఉద్యోగ భద్రతతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మరింత విస్తరించనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు పీకేఓసీ-2 డీప్ సైడ్ గని ని సింగరేణికి కేటాయించడంలో చూపిన చొరవ, సహకారానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ నాయకులు, సింగరేణి కార్మికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సింగరేణి కార్మికులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, మణుగూరు ప్రాంత అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. భవిష్యత్తులో కూడా కార్మికుల పక్షాన నిలిచి ఇదే విధంగా సేవలు కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రాజెక్టు క్యాంటీన్‌లో కార్మికులతో కలిసి టిఫిన్ చేస్తూ ఆప్యాయంగా ముచ్చటించారు. వారి సమస్యలు, సంక్షేమం, పని పరిస్థితులను అడిగి తెలుసుకుని, కార్మికుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు త్యాగరాజు వత్సవాయి ,కృష్ణంరాజ, గట్టయ్య, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సింగరేణి కార్మికులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణి నూతన అధికారులకు ఐఎన్ టీయూసీ శుభాకాంక్షలు

- సత్తుపల్లి ఏరియాలో సీబీఎస్ పాఠశాల ఏర్పాటు, కొత్త గనులు–ఉద్యోగాల కల్పనపై విజ్ఞప్తి



**సత్తుపల్లి, మహా :** సింగరేణి కార్పొరేట్ హెడ్ ఆఫీసులో నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులను సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జి.ఎం. (పర్సనల్-ఐఆర్ అండ్ పీఎం) జి.వి. కిరణ్ కుమార్, జి.ఎం. (పర్సనల్ వెల్ఫేర్ అండ్ సీఎస్ఆర్) కె. అజయ్ కుమార్, జి.ఎం. (పర్సనల్స్) శివ కేశవరావు, జి.ఎం. (ఎడ్యుకేషన్) రాజేంద్ర ప్రసాద్‌లను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఏరియా ఐ.ఎన్.టీ.యూ.సీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు మాట్లాడుతూ, సింగరేణి సంస్థను మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడంలో నూతన అధికారుల పాత్ర కీలకమని అన్నారు. రాబోయే రోజుల్లో కొత్త బొగ్గు గనులను ప్రారంభించి యువతకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఉద్యోగుల ప్రమోషన్లు, సర్వీస్ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.
కొత్తగా ఏర్పడిన సత్తుపల్లి ఏరియాలో సింగరేణి సీబీఎస్ పాఠశాలను ఏర్పాటు చేసి కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. సంస్థ అభివృద్ధికి ఐ.ఎన్.టీ.యూ.సీ యూనియన్ తరపున ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తామని కోటేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎన్.టీ.యూ.సీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, రీజియన్ జనరల్ సెక్రటరీ ఆల్బర్ట్, బ్రాంచ్ సెక్రటరీ మురళీకృష్ణ, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జగదీష్, పిట్ సెక్రటరీలు సీతారామరాజు, నగేష్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.




## తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పౌష్టికాహారం

- ఆరు నెలలపాటు తల్లిపాలు అందించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి
- బాలింతలకు తల్లిపాలపై అవగాహన సదస్సు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహణప్రపంచ తల్లిపాల వారోత్సవం (ఆగస్టు 1 నుండి 7 వరకు) సందర్భంగా నేడు కొండాపూర్ ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి హాజరై మాట్లాడుతూ మాట్లాడుతూ... ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలు అందించడం అత్యంత అవసరమని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తర్వాత రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం వరకు తల్లిపాలను కొనసాగిస్తూ, వయస్సుకు తగిన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడమే కాకుండా వ్యాధినిరోధక శక్తిని పెంపొందించి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని తెలిపారు.జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ... తల్లిపాల ప్రాముఖ్యతపై సమాజంలో మరింత అవగాహన పెంపొందించేందుకు ఆరోగ్య శాఖ విస్తృత కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ప్రతి గర్భిణీ, బాలింతకు తల్లిపాలపై సరైన అవగాహన కల్పించడం ద్వారా శిశు మరణాలను తగ్గించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా కోఆర్డినేటర్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ అనూరాగిణి రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ అధికారి శ్రీమతి శాంత శ్రీ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ షీబా హయత్, సీడీపీవో కవిత మాట్లాడుతూ... తల్లిపాల వల్ల తల్లి, బిడ్డ ఇద్దరికీ కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించి, ప్రతి తల్లి తప్పనిసరిగా శిశువుకు తల్లిపాలను అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీమతి మంజుల, ఏరియా ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ లక్ష్మి, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పొంగిపొర్లుతున్న సంగెం బ్రిడ్జి
- తహసిల్దార్ దశరథ , ఎస్సై యుగంధర్ గౌడ్

**వలిగొండ ఆగస్టు 4 మహా న్యూస్ :** హైదరాబాదులో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలోమండల పరిధిలోని సంగెం బ్రిడ్జి పై వరద ప్రవాహం వేగంగా రావడంతో బ్రిడ్జిపై ప్రజలు రైతులు జాగ్రత్తగా ఉండాలని అటువైపు ఎవరు వాహనదారులు వెళ్లకూడదని వలిగొండ తహసిల్దార్ దశరథ ఎస్సై యుగంధర్ గౌడ్ మంగళవారం విలేకరులకు తెలిపారు



## పోరాటాలతోనే కార్మికుల హక్కుల రక్షణ

**జైల్ భరో ను జయప్రదం చేయండి**

**కారేపల్లి, మహ :** పోరాటాలతోనే కార్మికుల హక్కుల రక్షించబడతాయని సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర అన్నారు. మంగళవారం కారేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) జనరల్ బాడీ సమావేశం యూనియన్ మండల అధ్యక్షురాలు వాంకుడోత్ కమల అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో కే.నరేంద్రం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టే విధంగా ప్రజా ఉద్యమాలకు బాధిత కార్మికులు మద్దతు ఇవ్వాలన్నారు. గ్రామాలలో వైద్య శాఖ వెన్నుముక్కగా ఉన్నఆరోగ్యకార్యకర్తలు(ఆశా) పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందన్నారు. ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులగాగుర్తించి కనీస వేతనం రూ.24వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ఆగస్టు 10న జరగనున్న జైల్ భరో ను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు జిల్లా నాయకురాలు వై.రాధ, పద్మ, జంగా కళ్యాణి, ఈసం ఈశ్వరి, సరస్వతి, వై పద్మ, ఆదెర్ల దేవకరణ, మేదరి కుమారి, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల వైద్యాధికారి డాక్టర్ బీ. సురేష్‌కు వినతిపత్రం అందజేశారు.

## వర్షపు నీటి సమస్యకు పరిష్కారం

**కారేపల్లి, మహా:** భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీలో భారీ వర్షాల కారణంగా ఇళ్లలోకి చేరిన వర్షపు నీటితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ బానోత్ హీరాలాల్ వెంటనే స్పందించి జేసీబీతో మట్టి, చెత్త తొలగించి నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టించారు. దీంతో బాధితులకు ఉపశమనం లభించింది. సర్పంచ్ చొరవను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుగులోత్ బీక్కులాల్, పంచాయతీ కార్యదర్శి పెండ్ర అనిల్, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పేదలకు ఉచిత కళ్ళ అద్దాల పంపిణీ

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 4 మహా:** బిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత కళ్ళ అద్దాల పంపిణీ చేయడం జరిగింది. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని భారత్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్ రెడ్డి హాజరై, నియోజకవర్గ పరిధిలోని పేదలకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి కళ్ళ అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేయించి వారికి కండ్ల అద్దాలు గుర్తించి అందజేయడం జరిగింది. అదేవిధంగా ప్రతి పేద వాడికి ఆరోగ్యం చాలా అవసరమని వాళ్లు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక పరిస్థితుల కారణంగా కార్పొరేట్ వైద్యం చేయించుకోలేరు కావున వారికి ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి కావలసిన మెడిసిన్స్ పంపిణీ జరుగుతుందని ఆయన అన్నారు. అదేవిధంగా ఇబ్రహీంపట్నం మండల కేంద్రం భారత్ గార్డెన్ లో 116 మందికి, ఉప్పరిగూడ గ్రామంలో 94 మందికి, యాచారంలో 85 మందికి, తుర్కయంజాల్ మున్సిపాలిటీలో 106 మందికి ఉచిత కళ్ళద్దాల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పరిగూడ సర్పంచ్ బోసుపల్లి శ్రీవేణి నందకుమార్, బూడిద నర్సింహారెడ్డి, మడుపు గోపాల్, పూన్నం రాము, బోసుపల్లి చంద్రశేఖర్, గౌరిగి రమేష్, లింగారెడ్డి, సద్దాం, వట్టిపెల్లి రాంరెడ్డి, మాచర్ల శంకర్, జుబూర్ కుమార్, శివ , తదితరులు పాల్గొన్నారు.

## సేవ్ మణుగూరు పోరాట ఫలితమే పీకేఓసీ–2 డీప్ సైడ్ బ్లాక్...

- స్వీట్లు పంచి సంబరాలు చేసిన నేతలు..
- ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రాంత భవిష్యత్తు, సింగరేణి కార్మికుల ఉపాధి పరిరక్షణ కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన సేవ్ మణుగూరు ఉద్యమ ఫలితంగానే పీకేఓసీ-2 డీప్ సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్ పేర్కొన్నారు. పీకేఓసీ-2 గనిలో మంగళవారం కార్మికులకు స్వీట్లు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మణుగూరుకు భవిష్యత్తు లేదని యాజమాన్యం ప్రకటించిన నాటి నుంచే బాధ్యతగల గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటీయూసీ ఉద్యమాలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. మణుగూరు ప్రాంత భవిష్యత్తు అంధకారంలో పడే ప్రమాదాన్ని గుర్తించి సేవ్ మణుగూరు నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సింగరేణి యాజమాన్యంపై నిరంతర పోరాటాలు నిర్వహించామని చెప్పారు. ఆ పోరాటాల ఫలితంగానే పీకే ఓసీ-2 సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కిందన్నారు. ఎలాంటి పోరాటాలు చేయని వారు, అధికారంలో ఉన్నవారు, సంస్థ అభివృద్ధిపై ఆలోచన లేనివారు నేడు తామే ఈ విజయాన్ని సాధించినట్లు ప్రచారం చేసుకోవడం, సామాజిక మాధ్యమాల్లో గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ విషయంలో టీబీజీకేఎస్, ఐఎన్‌టీయూసీ యూనియన్లకు మాట్లాడే అర్హత లేదన్నారు. గతంలో స్పందించడానికి భయపడిన వారు ఇప్పుడు వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందని, కార్మిక వర్గం వాస్తవాలను గమనిస్తోందని అన్నారు. పోరాటాల ద్వారానే విజయాలు సాధ్యమవుతాయని, సేవ్ మణుగూరు ఉద్యమం మరోసారి రుజువు చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఎంవి రాంనర్సయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వరరావు, పిట్ సెక్రటరీలు శనిగరపు కుమారస్వామి, బి. రవికుమార్, జి. సుదీప్, జానకీ ప్రసాద్, నేమాత్, నాగుల సతీష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆలయ పునర్నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలి

- ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలి
- భక్తులకు మెరుగైన దర్శన, మౌలిక వసతులు కల్పించేలా పనులు వేగవంతం చేయాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో చేపడుతున్న పునర్నిర్మాణ అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తో కలసి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న పునర్నిర్మాణ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ అభివృద్ధి పనులకు ఈ ఏడాది మార్చి నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగినట్లు తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించేందుకు ఈ పర్యటన చేపట్టినట్లు తెలిపారు.వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందన్నారు. అన్ని పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అవసరమైన పరిపాలనా సాంకేతిక ఆర్థిక చర్యలను సమన్వయంతో అమలు చేస్తున్నామని తెలిపారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా మరింత వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రోడ్లు భవనాల శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాచీనత ఆధ్యాత్మిక విశిష్టతకు భంగం కలగకుండా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. భక్తులకు మెరుగైన దర్శన సౌకర్యాలు విశాలమైన రాకపోకల మార్గాలు ఆధునిక మౌలిక వసతులు కల్పించి గోదావరి పుష్కరాల నాటికి అన్ని ప్రధాన పనులను పూర్తిచేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో భద్రాచలం తాసిల్దార్ రవికుమార్, పంచాయతీ ఈవో, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ అధికారులు, రోడ్లు భవనాల శాఖ ఇంజినీర్లు, సంబంధిత శాఖల అధికారులు నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## భద్రాద్రికి సీతారామ జలాలు అందించాలి

- స్థానిక రైతాంగానికి ప్రతి ఎకరానికి నీరు ఇవ్వాలి
- ధరల పెరుగుదల కార్మిక చట్టాలపై దాడిని ప్రతిఘటిద్దాం
- పెండింగులో ఉన్న పోడు భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలి
- 'బద్లావ్ జరూరీ హై' నినాదంతో దేశవ్యాపిత నిరసనలు
- 6 నుంచి 'ప్రజాచైతన్య యాత్రలు'
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా




**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని ప్రతీ ఎకరానికి సాగునీరు అందించి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 7,80,000 ఎకరాల ఆయకట్టు ఉండగా, ప్రస్తుతం కేవలం 2,40,000 ఎకరాలకే నీరు అందే పరిస్థితి ఉందన్నారు. సుమారు 100 కిలోమీటర్లకు పైగా గ్రావిటీ కాలువలు తవ్వి స్థానిక ప్రజలను నిర్వాసితులను చేసినప్పటికీ పూర్తి స్థాయిలో జిల్లా రైతాంగానికి సాగునీరు అందించకపోవడం దుర్మార్గమైదన్నారు. ఆయకట్టు పరిధిని పెంచి ఇల్లందు, పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, భద్రాచలం నియోజకవర్గాల్లోని చెరువులను నింపి సాగునీరు అందించాలని కోరారు. నిత్యావసరాలు పెట్రో ఉత్పత్తుల ధరలను నియంత్రించాలని పంటలకు కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలన్నారు. కేంద్రం మార్చిన 44 కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్య, ఉపాధి హక్కులను రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులుగా చేర్చాలని స్పష్టం చేశారు. మతోన్మాద శక్తుల నుంచి దేశ ఐక్యతను రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాలో మిగిలిన 73,000 ఎకరాల పోడు భూములకు వెంటనే పట్టాలు పంపిణీ చేయాలని, కేటీపీఎస్ సమీపంలో కొత్త ప్లాంటును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భద్రాచలానికి ఆనుకుని ఉన్న 5 గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలపాలని కోరారు. విద్యా వైద్య రంగాలను పేదలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల సాధనకై సీపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆగస్టు 6 నుండి 14 వరకు "ప్రజా చైతన్య యాత్రలు" అందులో భాగంగా జాతీయ, జిల్లా స్థాయి సమస్యలపై భద్రాద్రి జిల్లాలో ఏడూళ్ల బయ్యారం నుంచి అశ్వారావుపేట వరకు అన్ని మండలాలను గ్రామాలను కలుపుతూ యాత్రలు చేపడుతున్నామని తెలిపారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో లక్షలాది మందితో "దేశంలో మార్పు కోసం" భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. యాత్రలకు అన్నివర్గాల ప్రజలు సంఘీభావం తెలపాలని కోరారు. విలేకర్ల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, వి.పూర్ణచందర్ రావు, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, గనగళ్ళ వీరాస్వామి, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్ కె ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.




## అండర్ పాస్ రోడ్ పనులు పూర్తి చేయాలి

**భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 4 మహా :** భువనగిరి నియోజకవర్గ పరిధిలోని ఎన్ హెచ్ 163 జాతీయ రహదారిపై రోడ్డు భద్రతా పనులను త్వరితగతిన చేపట్టాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఎన్‌హెచ్ఏ చీఫ్ జనరల్ మేనేజర్ (టెక్నికల్) & రీజినల్ ఆఫీసర్ శివశంకర్ ను కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు.బఈ సందర్భంగా సింగన్నగూడెం క్రాస్ రోడ్, రామకృష్ణాపురం గ్రామ క్రాస్ రోడ్, అనంతారం గ్రామ క్రాస్ రోడ్ వద్ద అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేయాలని కోరారు.ఈ ప్రాంతాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని, ప్రతిపాదిత పనులకు అవసరమైన అనుమతులు మంజూరు చేసి, ప్రాధాన్యత ప్రాతిపదికన త్వరితగతిన పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కోరారు.



## క్రమశిక్షణతోనే గుర్తింపు

- సింగరేణి సెక్యూరిటీ ట్రైనింగ్ అధికారి జాకీర్ హుస్సేన్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**క్రమశిక్షణతో విధి నిర్వహణ మెరుగు పడడంతో పాటు గుర్తింపు లభిస్తుందని సింగరేణి సెక్యూరిటీ అండ్ ట్రైనింగ్ అధికారి జాకీర్ హుస్సేన్ అన్నారు. కొత్తగూడెం ట్రైనింగ్ సెంటర్లో నాలుగు రోజులపాటు జరిగే శిక్షణ తరగతులను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ క్రమశిక్షణ అనేది ముఖ్యమని పేర్కొన్నారు. మనం క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నపుడే గుర్తింపు వస్తుందని ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ అవసరం అని చెప్పారు. ఈ శిక్షణ వలన డ్యూటీ జీవితంలోనే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఉపయోగకరమైనదని ఈ నాలుగు రోజుల శిక్షణా కాలంలో ట్రాఫిక్ రెగ్యులేటరీ చట్టం మాండేటరీ కాషనరీ ఇన్ఫర్మేటరీ సిగ్నల్స్ ట్రాఫిక్ పాయింట్‌మన్ డ్యూటీస్ క్రౌడ్ కంట్రోల్ వంటి అంశాలపై అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే పూర్తి అవగాహన కలిగించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ వలన ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా మెయిన్ గేటు వద్ద చెక్ పోస్ట్ ల వద్ద రద్దీ లేకుండా సాఫీగా అందరు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు దోహదం చేస్తుందని తెలిపారు. ఎస్ అండ్ పిసి విభాగము పటిష్టంగా ఉండేందుకు కావలసిన అన్ని రకాల చర్యలు ట్రైనింగ్ సెంటర్ అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు యాజమాన్యం అందిస్తుందని తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది అందరు మెరుగైన వృత్తి నైపుణ్యంతో అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ సింగరేణి ఆస్తులు స్థలాలను పరిరక్షించాలని సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జూనియర్ ఇన్స్పెక్టర్ కె.రాజనర్సు, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.




## ఈవీఎం గోడౌన్ భద్రతను నిరంతరం పర్యవేక్షించాలి

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్
- ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఈవీఎం గోడౌన్ భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలో ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి నెలా క్రమం తప్పకుండా గోడౌన్లను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల భద్రత అత్యంత కీలకమైన అంశమని అందుకు అనుగుణంగా అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీలో భాగంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం సీసీ కెమెరా నియంత్రణ గదిని సందర్శించి కెమెరాల పనితీరు రికార్డింగ్ వ్యవస్థ విద్యుత్ బ్యాకప్ భద్రతా పర్యవేక్షణ ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గోడౌన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ప్రమాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకుండా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గోడౌన్ వద్ద విధులు నిర్వహించే భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అనుమతి లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ గోడౌన్‌లోకి అనుమతించరాదని ఆదేశించారు. గోడౌన్ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఈవీఎం గోడౌన్ తనిఖీ రిజిస్టర్లను పరిశీలించి సంతకం చేశారు.ఈ తనిఖీలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## యాప్ ల ద్వారా ఎరువుల బుకింగ్ విధానం సరైనది కాదు

- రైతులు చేసేది సాఫ్ట్వేర్ ఉద్యోగం కాదు
- జనసేన అధ్యక్షుడు ఉసికల రమేష్




**జూలూరుపాడు, మహా:**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆన్లైన్ ఎరువుల బుకింగ్ విధానం సరైంది కాదని, రైతులు చేసేది సాఫ్ట్వేర్ ఉద్యోగం కాదని, భద్రాద్రి జిల్లా, జూలూరుపాడు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఉసికల రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎరువుల బుకింగ్ ప్రక్రియలో రైతులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది రైతులకు స్మార్ట్‌ఫోన్‌లు లేవని, ఉన్నవారికి యాప్‌ల వినియోగంపై పూర్తి అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.రైతులు చేసేది సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కాదని, చదువు లేక, వ్యవసాయంపై ఆధారపడి తాము తింటూ ఇతరులకు తిండి పెడుతున్నారని అన్నారు. ఎరువులు కొనుగోలు చేయడానికి యాప్‌లు, ఆన్‌లైన్ బుకింగ్‌ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరైనది కాదని, దీనివలన సరైన సమయంలో పంటలకు కావలసిన ఎరువులు అందక తీవ్రంగా పంట నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం యూరియా బుకింగ్ జరుగుతున్నట్లు, ఆగస్టు ఆరో తారీకు నుండి మిగతా కాంప్లెక్స్ ఎరువులు కూడా అలానే బుక్ చేసుకోవాలని వస్తున్న కథనాలను అదునుగా చేసుకొని ఎరువుల డీలర్లు రైతులను మరింతగా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇదే అదునుగా రైతులకు ఎరువులను అంటగట్టి వారి గోడౌన్లు ఖాళీ చేస్తూ, సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. అదే విధంగా మండలంలో సుమారుగా 20 మందికి పైగా ఎరువుల డీలర్లు ఉన్న, యూరియా నిలువలు రైతులకు అందుబాటులో ఉంచకపోవడం విడ్డూరమని, డీలర్లు కాంప్లెక్స్ ఎరువులు ఏవిధంగా అమ్ముతున్నారో యూరియని కూడా అదేవిదంగా అమ్మాలని, లేని పక్షంలో ప్రభుత్వం డీలర్ల లైసెన్స్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

## ప్రజల్లో విశ్వాసం పెరిగేలా విధులు : ఎస్పీ

- ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ
- రికార్డుల పరిశీలన
- సిబ్బందికి పలు సూచనలు

**ఆదిలాబాద్ మహా :** ప్రజల్లో పోలీసులపై విశ్వాసం, కీర్తి ప్రతిష్ఠలు పెరిగేలా విధులు నిర్వహించాలని సిబ్బందికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సిబ్బంది పరేడ్‌ను పరిశీలించారు. పరేడ్ యొక్క ఆవశ్యకతను వివరించి ప్రతి వారం తప్పనిసరిగా పరేడ్ నిర్వహించాలని సూచించారు. సిబ్బందికి కేటాయించిన కిట్ సామగ్రిని పరిశీలించి యూనిఫాం అలవెన్స్‌ను సక్రమంగా వినియోగించుకోవాలని, విధుల సమయంలో చక్కటి యూనిఫాంలో విధులు నిర్వహించాలని సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. స్టేషన్‌లో నమోదైన రికార్డులు, కేసు ఫైళ్లు, ఇతర రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, వర్టికల్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, సీసీటీఎన్ఎస్‌లో ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని ఆదేశించారు. కోర్టు మానిటర్ సిస్టం ద్వారా నిందితులు కోర్టులకు హాజరయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ వి.పి.ఓ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, సమాచార వ్యవస్థను పటిష్టంగా నిర్మించుకొని మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలని సూచించారు. విధుల పట్ల నిబద్ధత, నీతి, నిజాయితీతో వ్యవహరించాలని, అత్యవసర పరిస్థితుల్లో క్షణాల వ్యవధిలో స్పందించి సంఘటనా స్థలాలకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని తెలిపారు. డయల్ 100 సిబ్బంది ప్రతిరోజూ రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లను తనిఖీ చేస్తూ వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. స్టేషన్ రిసెప్షన్‌లో ప్రజల సమస్యలను బాధ్యతతో స్వీకరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు సమాచారాన్ని సేకరించి సమస్యలు పెద్దవి కాకముందే పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నేరస్తులు తప్పించుకోకుండా పటిష్టమైన దర్యాప్తు చేపట్టి కఠిన శిక్షలు పడేలా కేసులను బలోపేతం చేయాలని అధికారులకు ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్వీక్ సాయి కొట్టే ఐపీఎస్, ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్, ఇంద్రవెల్లి ఎస్ఐ ఈ. సాయన్న పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## వర్షా భావంతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వాలు ఆదుకోవాలి

**తాహశీల్దార్ కి వినతి**




జూలూరుపాడు, మహా: వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం డిమాండ్ చేసింది. రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జూలూరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తాహశీల్దార్ శ్రీనివాసకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐయూకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం సీజన్లో వర్షాలు సకాలంలో, సజావుగా కురుస్తాయంటూ వాతావరణ నిపుణులు ఇచ్చిన అంచనాలు, ప్రభుత్వ ప్రకటనలు నమ్మి రైతులు ఎంతో ఆశతో సాగు పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. అయితే ఆచరణలో అక్కడక్కడా స్వల్ప జల్లులు పడటం మినహా వర్షాలు ముఖం చాటేశాయని, భానుడి ప్రతాపానికి, ఎండ తీవ్రతకు వేసిన పంటలన్నీ కళ్లముందే ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు పోయి తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన రైతాంగానికి ప్రభుత్వాలు తక్షణ నష్ట పరిహారాన్ని చెల్లించి భరోసా కల్పించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ సాగుకు అనువుగా ఉండే అన్ని రకాల విత్తనాలను రైతులకు పూర్తి ఉచితంగా సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే గతేడాది పంట రుణాల మాఫీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ఈ ఏడాది సాగు కోసం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొత్త రుణాలు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. రైతాంగ సమస్యలపై ప్రభుత్వాలు స్పందించకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐయూకేఎస్ మండల కార్యదర్శి తోటకూర నరేశ్, నాయకులు పారుపల్లి బాబురావు, ఎస్ మధు, బి నాగేశ్వరరావు, నరసింహారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## సంస్థాన్ నారాయణపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 4 మహా:**యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ సంస్థాన్ నారాయణపూర్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని జనరల్ డైరీ (జీడి) ఎంట్రీ బుక్‌తో పాటు వివిధ పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, నమోదు విధానం సక్రమంగా ఉందో లేదో తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు మరియు స్టేషన్‌లోని మొత్తం వాతావరణాన్ని పరిశీలించారు. ఈ తనిఖీ సందర్భంగా స్టేషన్ ఎస్‌హెచ్ఓ జగన్ ఎస్పీ వెంట ఉండి పోలీస్ స్టేషన్ పనితీరు, చేపడుతున్న కార్యక్రమాలు మరియు ప్రస్తుత పరిస్థితులపై వివరాలు అందించారు. పోలీస్ స్టేషన్‌లో క్రమశిక్షణ, రికార్డుల సమర్థవంతమైన నిర్వహణ, అప్రమత్తత, ప్రజా ఫిర్యాదులపై సత్వర స్పందన మరియు ప్రజలకు అనుకూలమైన పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం సిబ్బంది అంకితభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఆదేశించారు.




## సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి..

**మణుగూరు మోడల్ పీహెచ్‌సీ సందర్శనలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సూచన..**

**మణుగూరు, మహా :** వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల నివారణ, రక్తహీనత నిర్మూలన, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, గర్భిణీలు-బాలింతల ఆరోగ్య సంరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సూచించారు. మంగళవారం మణుగూరు మోడల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (ఎంపీహెచ్‌సీ) ఆయన సందర్శించి ఆశా డే సమావేశంలో ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి దోమల ఉత్పత్తి కేంద్రాలను నిర్మూలించాలని అన్నారు. దోమ తెరల వినియోగం, పూర్తి చేతుల దుస్తులు ధరించడం వంటి నివారణ చర్యలపై ప్రజలకు ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని కోరారు. కలుషిత నీటి వల్ల టైఫాయిడ్, వాంతులు, విరేచనాలు వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నందున తాగునీటిని తప్పనిసరిగా మరిగించి లేదా శుద్ధి చేసి వినియోగించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక అంటువ్యాధులను నివారించవచ్చని వివరించారు. యుక్తవయస్సు, గర్భిణీ దశ, బాలింతలలో రక్తహీనత నివారణకు పౌష్టికాహారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఆకుకూరలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, గుడ్లు, పాలు, పండ్లు, బెల్లం, నువ్వులు వంటి పోషకాహారాన్ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు వైద్యుల సూచన మేరకు ఐరన్-ఫోలిక్ యాసిడ్ (ఐఎఫ్ఏ), కాల్షియం మాత్రలను క్రమం తప్పకుండా తీసుకోవడంతో పాటు అన్ని ఏఎన్‌సీ పరీక్షలను నిర్ణీత సమయంలో చేయించుకోవాలని తెలిపారు. తల్లి పాల ప్రాముఖ్యతను వివరిస్తూ, శిశువుకు తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే అందించాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శిస్తూ సీజనల్ వ్యాధుల నివారణ, సురక్షిత తాగునీటి వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత నిర్మూలన, పౌష్టికాహారం, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సంరక్షణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు డా. తుకారాం రాథోడ్ సూచించారు. ఈ సందర్భంగా మణుగూరు మోడల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

**వరంగల్, మహా;** వరంగల్ నగరం లోని దేశాయిపేట సికేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2026 27 విద్యా సంవత్సరంలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. పోశయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో కంప్యూటర్ సైన్స్ పోస్టులు (2) ఖాళీగా ఉన్నాయని ఇందుకు ఓసి, బిసి అభ్యర్థులు అయితే 55% మార్కులతో ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు అయితే 50% మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఎంపికలో పి హెచ్ డి, నెట్, సెట్ అర్హత బోధన అనుభవం కలిగిన వారికి తొలి ప్రాధాన్యం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను 11 8 2026 తేదీ సాయంత్రం నాలుగు గంటల్లోగా అందజేయాలని కోరారు. అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన వారికి సమాచారం అందించి ఎంపిక ప్రక్రియ చేపడతామని తెలిపారు. పూర్తి వివరాల కోసం సి కె ఎం కళాశాలను సంప్రదించగలరని ఆయన తెలిపారు.



## వరంగల్ కమిషనరేట్ పరిధిలో "సురక్ష కా తిరంగా" కార్యక్రమం

- **సైబర్ క్రైమ్ పై విస్తృతంగా ప్రజలకు అవగాహనా కల్పించాలి**
- **వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపిఎస్**

**వరంగల్, క్రైమ్ మహా:** తెలంగాణడీజీపీ సూచనల మేరకు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ ఆదేశానుసారం వరంగల్ కమిషనరేట్ పరిధిలో సురక్ష కా తిరంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపిఎస్ అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా సైబర్ క్రైమ్ అవగాహనా కార్యక్రమాలు , వరంగల్ పోలీస్ కమిషనర్ అలాగే డీఎస్పీ, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, వరంగల్ ఆధ్వర్యంలో తేదీ 5 8 2026 నుండి నాలుగు వారాల పాటు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సురక్ష కా తిరంగా సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడుతాయని సిపి ఒక ప్రకటనలో తెలిపారు.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ సురక్ష కా తిరంగా కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలందరికీ దశలవారీగా నాలుగు వారాలపాటు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబడతాయి. ప్రజలందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ విజ్ఞప్తి చేస్తోంది.

### ఏటీసీల తో ఉపాధి అవకాశాలు మెరుగు..

# యువతకు ఆధునిక శిక్షణ అందిస్తాం

- **విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ట్రైనింగ్ ఇప్పిస్తాం**
- **మంత్రి వివేక్ వెంకటస్వామి**



**వేములవాడ మహా:** అడ్వాన్స్డ టెక్నాలజీ సెంటర్ల తో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి రూ.45 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవన నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు డైరెక్టర్ ఉపాధి కల్పన అండ్ శిక్షణ శాఖ ఐఏఎస్ ఏ నిర్మల క్రాంతి వెస్లీ,జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె తో కలిసి శంకుస్థాపన చేశారు.

మంత్రి వివేక్ వెంకటస్వామికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి.. కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ గీతం జయ జయహే తెలంగాణ వినిపించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన పెన్షన్లకు సంబంధించిన కీలక ప్రకటన చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో రూ. 4000 వేల కోట్లతో 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఐటీఐలను రాష్ట్ర ప్రభుత్వం ఆధునీకరిస్తోందన్నారు. రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించామని, ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైపెండ్ అందిస్తున్నామని తెలిపారు.జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకొని విదేశీ భాషల శిక్షణ అందిస్తున్నామని, రుద్రంగికి జర్మన్ భాషా శిక్షకుడిని పంపించి 100 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ ఉపయోగపడే విధంగా ఏటీసీల్లో నూతన కోర్సులు ప్రవేశ పెడతామని తెలిపారు.ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి కలెక్టర్లు, ఎస్పీలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

**ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..**

రుద్రంగిలో 1986లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటై విద్యాభివృద్ధికి దోహదపడిందన్నారు. మూడపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. స్కూల్ లో 2500 మంది విద్యార్థులు చదివే అవకాశం ఉందని వివరించారు. అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యులను చేస్తున్నామని తెలిపారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ రోడ్లు అభివృద్ధి చేయిస్తున్నామని, విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయించామని వివరించారు. త్వరలో హ్యామ్ ద్వారా వివిధ రోడ్లు అభివృద్ధి చేస్తామని తెలిపారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు కోసం రూ.45 కోట్ల భూసేకరణ చేపట్టామని తెలిపారు. ఆయా పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని, ఆలయ విస్తీర్ణం పెరుగుతుందని, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వేములవాడ రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయని, మూలవాగుపై రెండో వంతెన నిర్మాణం తుది దశకు చేరుకుందని చెప్పారు.ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోందన్నారు. రుద్రంగి ఏటీసీలో 288 మంది విద్యార్థులు ఏడు కోర్సుల్లో శిక్షణ పొందే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. మర్రిపల్లిలో రైతు విజ్ఞాన కేంద్రం, ఆధునిక గోశాల కోసం చెరో 40 ఎకరాలు కేటాయించినట్లు వెల్లడించారు.

**పరిశ్రమలకు ఉపయోగపడే శిక్షణ**

ఏటీసీల ద్వారా ప్రస్తుత పరిశ్రమలకు ఉపయోగపడే శిక్షణ ఇస్తారని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ప్రత్యేక చొరవతో అడ్వాన్స్డ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు అవుతున్నాయని వివరించారు. ప్రస్తుత మార్కెట్ డిమాండ్ అవసరమైన కోర్సులు రూపొందించారని తెలిపారు. ఏటీసీల్లో ఏడు కోర్సులు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఏఐ, డ్రోన్ టెక్నాలజీ, ఇతర ఆధునిక కోర్సులలో శిక్షణ అందించి.. ఉపాధి అవకాశాలు కూడా వస్తాయని తెలిపారు. నియోజకవర్గంలోని యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. స్థానిక ఏటీసీ కేంద్రం ఈ ప్రాంతం వారికి చాలా కీలకమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకుల తిరుపతి, ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ ముకుంద రెడ్డి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, సర్పంచ్ గండి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆస్పత్రులలో ఫైర్ సేఫ్టీ ఎక్కడ

- **నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు**
- **ఆసుపత్రుల' దందా పై ఉక్కుపాదం మోపాల్సిందే!**

**వరంగల్, మహా ;** హైదరాబాద్‌లో బట్టబయలైన నకిలీ ఫైర్ ఎన్ఓసీల కుంభకోణం తరహాలోనే.. వరంగల్ జిల్లా తో పాటు ముఖ్యంగా హనుమకొండ చౌరస్తా కేంద్రంగా భారీ అక్రమాలు జరుగుతున్నట్లు ప్రచార మాధ్యమాలలో ప్రచారం జోరుగా సాగుతోంది. విద్య, వైద్యం, వాణిజ్య పరంగా ఎంతో కీలకమైన ప్రవేట్ సంస్థలలో .. ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రులు కనీస అగ్నిమాపక రక్షణ చర్యలు లేకుండా రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి.

హనుమకొండ, వరంగల్ నగర వ్యాప్తంగా ఇదే తంతు..!ప్రజలకు ప్రాణసంకటంగా ప్రైవేట్ ఆసుపత్రులు మారాయని కొన్ని ఘటనలే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. హనుమకొండ చౌరస్తా చుట్టుపక్కల వెలసిన పలు ప్రైవేట్ ఆసుపత్రులలో కనీస ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు లేవు కనీసంరెన్యూవల్స్ కూడా లేవని దర్జాగా వైద్యం పేరుతో దర్జాగా వ్యాపారం కొనసాగిస్తున్న సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రజలు నుంచి వెల్లు వెత్తుతున్నాయి. కొన్ని ఆస్పత్రులలో ఫైర్ సేఫ్టీ ఉన్నా ఫైర్ ఎన్ఓసీలు ఎప్పుడో గడువు ముగిసినా వాటిని రెన్యూవల్ చేయించుకోకుండానే నెలల తరబడి దర్జాగా హాస్పిటల్స్ నడుపుతున్నారు.

**వేలల్లో లంచాలు - అధికారుల అండ**

ఒక్కో ఎన్ఓసీ మంజూరు వెనుక రూ. వేలల్లో చేతులు మారుతున్నాయని,ఉన్నతాధికారుల హస్తం వల్లే ఇదంతా చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా బయో వేస్టేజ్ అనుమతులలో పైసలు లేనిది పని జరగదని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

**నగర వ్యాప్తంగా ఇదే తంతు**

కేవలం హనుమకొండ చౌరస్తా నే కాకుండా వరంగల్ మున్సిపల్ రోడ్ లోని ఓ హాస్పిటల్, జేపీఎన్ రోడ్, హంటర్ రోడ్, కాజీపేట ఇండస్ట్రీ ఏరియా ల్లోని విద్యా, వాణిజ్య సముదాయా ల్లోనూ ఇదే బూటకపు వ్యవహారం నడుస్తున్నట్లు ఆరోపణలు విన వస్తున్నాయని ఇటీవల వరంగల్ జిల్లాకు నూతనంగా వచ్చిన డిఎంహెచ్ఓ రాజిరెడ్డి ఈ వ్యవహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు. వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖ, మున్సిపల్ అధికారులు తక్షణమే ఉమ్మడి కమిటీగా ఏర్పడి హనుమకొండ చౌరస్తాలోని ప్రతి ఆసుపత్రి, ల్యాబ్, స్కానింగ్ సెంటర్ల పై తనిఖీలు చేసి వాస్తవాలను వెలికి తీయాలని వరంగల్ హనుమకొండ జిల్లాల కలెక్టర్ల ను ప్రజలు వేడుకుంటున్నారు.

# రేషన్ బియ్యం అక్రమ రవాణా

- **6 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం**
- **నలుగురి పై కేసు , ముగ్గురు అరెస్ట్**



**ఆదిలాబాద్ మహా:** మహారాష్ట్రకు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ముఠాను పట్టుకున్నట్లు సీఐ బి. సునీల్ కుమార్ తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలలో 6 క్వింటాళ్ల ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టు తెలిపారు.స్థానిక ఎయిరోడ్రోమ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక మ్యాక్స్ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 6 క్వింటాళ్ల ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని గుర్తించారు. వెంటనే బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ప్రజల వద్ద నుంచి ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని అక్రమంగా సేకరించి మహారాష్ట్రకు తరలిస్తూ అక్రమ లాభాలు పొందుతున్న ముఠాపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి బి నందిని ఫిర్యాదు మేరకు,ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.



### బెల్లంపల్లి అభివృద్ధిపై మాట్లాడే

# నైతిక హక్కు భాజపా పార్టీకి లేదు

- **బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు భారతీయ జనతా పార్టీ నాయకులకు లేదని బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ స్పష్టం చేశారు. మంగళవారం రోజు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణ అభివృద్ధితో పాటు నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా కట్టుబడి ఉందని అందుకు స్థానిక ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని వెల్లడించారు.బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామిపై బీజేపీ నేత కొయ్యల ఏమాజీ చేసిన అనుచిత, అర్ధరహిత వ్యాఖ్యలను బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నామని,ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే వినోద్ పై వ్యక్తిగత విమర్శలు చేయడం కాకుండా, బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఏం చేసింది? బెల్లంపల్లి నియోజకవర్గానికి ఏ ప్రాజెక్టులు, నిధులు, పరిశ్రమలు తీసుకొచ్చారు? అనే విషయాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం నుండి 8మంది బిజెపి పార్లమెంటు సభ్యులను ఇస్తే ఒక్క సింగరేణి బొగ్గుగని అయినా, ప్రభుత్వ ప్రాజెక్ట్ అయిన తీసుకొచ్చిన ఘనత ఉందా మీ బీజేపీకి 8మంది ఎంపీ లు నోటికి తాళంవేసుకొని పార్లమెంట్లో కూర్చుంటున్నారే తప్ప ఉద్యమాల తెలంగాణ రాష్ట్రానికి ఏమి చేశారనీ ఎద్దేవా చేశారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న మీరు బాధ్యతాయుతంగా ప్రజల సమస్యలను ప్రశ్నించండి. పాలక పక్షంలో ఉన్న మేము ప్రజల తరపున జవాబుదారీ తనంతో సమాధానం చెబుతాం. రాజకీయ విమర్శలు విధానాలపై పద్ధతి ప్రకారం ప్రశ్నించడం ఉండాలి కానీ వ్యక్తిగత దూషణలకు దిగితే ఎదుటివారి నుండి కూడా అదే విధంగా సమాధానాలు వస్తాయని గుర్తు చేశారు. బెల్లంపల్లి ప్రజలకు ఏది అవసరమో అది చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు.రాష్ట్రంలో కానీ దేశంలో కానీ పోడు భూముల సమస్యను పరిష్కరించింది గతంలో పట్టాలిచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అనేది తెలుసుకోవాలని నేడు రాష్ట్రంలో పోడు భూముల సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని భాజపా నాయకులకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర టీపీసీసీ మెంబర్ చిలుముల శంకర్ , మాజీ కౌన్సిలర్ దామెర శ్రీనివాస్,మంచిర్యాల జిల్లా మీడియా కన్వీనర్ దేవసాని ఆనంద్, నాయకులు దెబ్బేటి రమేష్, ముడిమడుగుల మహేందర్, కుంభాల రాజేష్,ఖాజాపాషా,పోలు శ్రీనివాస్,రేగుంటరాజలింగు, పారేపల్లి పరమేష్,వాజిద్, శనిగల శంకర్, కేశబోయిన శ్రీనివాస్, వీరయ్య, జలంధర్ సింగ్ భరద్వాజ్, రామిల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## పార్కులు, వైకుంఠధామాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

**జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న**

**వరంగల్, కార్పొరేషన్ మహా ;** గ్రేటర్ వరంగల్ నగరంలోని పార్కులు, వైకుంఠధామాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా, ప్రజలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.

మంగళవారం కమిషనర్ నగరంలోని పలు పార్కులు, వైకుంఠధామాలను క్షేత్రస్థాయిలో సందర్శించి నిర్వహణ తీరు, అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ముందుగా హనుమకొండ బాలసముద్రం 30వ డివిజన్ లోని ప్రొఫెసర్ జయశంకర్ పార్కు సందర్శించిన కమిషనర్, పార్కులో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ నెల 6న తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జయంతి నాటికి పార్కు మరింత ఆకర్షణీయంగా కనిపించేలా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు.ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించిన కమిషనర్, మిగిలిన పనులను దశలవారీగా వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పార్కులో హరితీకరణ విస్తరణ, నడక మార్గాల నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటు, పరిశుభ్రత, సందర్శకులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

అనంతరం 54వ డివిజన్ పోచమ్మకుంటలోని వైకుంఠధామంతో పాటు 57వ డివిజన్ టీవీ టవర్ ప్రాంతంలోని వైకుంఠధామాన్ని సందర్శించిన కమిషనర్ అక్కడి నిర్వహణ తీరును సమీక్షించారు. వైకుంఠధామాల్లో నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ, హరితీకరణ, మొక్కల సంరక్షణ, అంతర్గత రహదారుల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాల నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైకుంఠధామాల నిర్వహణను అత్యుత్తమ ప్రమాణాలతోకొనసాగించాలని, నగరంలోని పార్కులు, వైకుంఠధామాలు పరిశుభ్రత, పచ్చదనం, సౌకర్యాల పరంగా ఆదర్శంగా నిలిచేలా అధికారులు కృషి చేయాలని కమిషనర్ సూచించారు. చేపట్టిన అభివృద్ధి పనుల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ హరి తదితర అధికారులు పాల్గొన్నారు.



# 28వ డివిజన్ లో తగ్గని అక్రమ నిర్మాణాల జోరు

- **ఇరుకైన గల్లీలో విచ్చలవిడిగా జీ+4 భవన నిర్మాణాలు**
- **నిబంధనలకు తూట్లు పొడుస్తున్న భవన యజమానులు**
- **కొనసాగుతున్న స్థానిక మాజీ నాయకుల హవా**
- **మాజీ తో బల్దియా సిబ్బంది కుమ్మక్కు పై స్థానికుల ఆగ్రహం**
- **బల్దియా ఆదాయానికి భారీ గండి.. పట్టించుకోని అధికారులు**






**వరంగల్, బ్యూరో మహా :** స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతున్న గ్రేటర్ వరంగల్ నగరం లో ఒకవైపు రోడ్లు, అంతర్గత డ్రైనేజీ తో పాటు ప్లై ఓవర్లు వస్తుంటే, మరోవైపు నగరంలో "బిల్డ్ నౌ" నిబంధనలు ఉల్లంఘిస్తూ సంబంధిత అధికారులతో కుమ్మక్కై అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతూనే ఉంది. వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని 28వ డివిజన్ లో మాత్రం నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించి ఇరుకైన గల్లీలో బహులంతస్తుల భవన నిర్మాణాల హవా కొనసాగుతోంది, దీనికి టౌన్ ప్లానింగ్ అధికారి పర్యవేక్షణ లేకపోవడమే ముఖ్య కారణమని ప్రజలు అంటున్న మాట. ఇందుకు భిన్నంగా డివిజన్లో టౌన్ ప్లానింగ్, రెవిన్యూ సిబ్బంది తో కలిసి ఓ మాజీ.. స్థానిక నాయకుడు కొత్త చట్టానికి కూడా తూట్లు పొడుస్తూ విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాల పై వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారని స్థానికులు ఇతర నాయకులు బహిరంగంగానే చెబుతున్నారు. పదవులు పోయిన కొంతమంది స్థానిక నాయకులు అధికార పార్టీ నేతలు, బల్దియా సిబ్బంది తో కుమ్మక్కై జనాల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**28వ డివిజన్ లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు**

వరంగల్ 28 డివిజన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో రోజురోజుకు కొత్త భవనాలు పుట్టుకొస్తున్నాయి. అనుమతులు లేకుండా కొన్ని, ఒకవేళ అనుమతులు ఉన్నా నిబంధనలను పక్కన పెట్టి జి+3, జి+4 అంతస్తుల వరకు నిర్మిస్తున్నారు.

సెట్ బ్యాక్ లేదు, పార్కింగ్ స్థలం లేదు, ఫైర్ సేఫ్టీ, ఎన్ఓసీ లేదు. నాలాలు, ప్రభుత్వ భూముల పై కూడా ఆక్రమణలు జరిగాయి, జరుగుతున్నాయి. స్థానికులు ఫిర్యాదు చేసినా బిల్డింగ్ ఇన్స్పెక్టర్ ఫోన్ లిఫ్ట్ చేయడని ఆ భవనం పూర్తయ్యాకే వేరే ఇతర కారణాలతో వారి దగ్గర నుండి స్పందన ఉంటుందని లేదా "విచారణలో ఉంది" అనే ఒకే సమాధానం వస్తుంది తప్ప క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కొంతమంది స్థానికులు స్పష్టంగా చెబుతున్నారు.

**మాజీ నుండి అధికారుల వరకు అక్రమ నిర్మాణాలకు అండ**

ఈ అక్రమాల వెనుక తాజా, మాజీ కార్పొరేటర్లు, రాజకీయ పార్టీల నాయకుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. "మేము చెప్తే అధికారులు ఏమీ చేయరు" అని బిల్డర్ల కు, భవన యజమానులకు ధైర్యం చెప్తున్నారు. బల్దియా సర్వేర్లతో పాటుటౌన్ ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు, సిబ్బంది బిల్డర్ల నుండి "మామూళ్లు" తీసుకుని ఫైళ్లను క్లియర్ చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఫిర్యాదు చేసిన ఫైళ్లు నెలల తరబడి పెండింగ్ లో ఉంటున్నాయి. ఫలితంగా అక్రమ నిర్మాణాలు దర్జాగా పూర్తవుతున్నాయి.

**15 ఫీట్లు కూడా లేని గల్లీలో బహులంతస్తుల నిర్మాణాలు**

ఇదే డివిజన్ లో అతిపెద్ద ప్రమాదం ఇది. 15 నుండి 20 ఫీట్ల ఇరుకైన గల్లీ ల్లో 4 అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం 30 ఫీట్ల రోడ్డు ఉంటేనే జి+2కి అనుమతి. కానీ ఇక్కడ నిబంధనలను తుంగలో తొక్కారు.అగ్ని ప్రమాదం జరిగితే ఫైర్ ఇంజన్ లోపలికి వెళ్లదు. రోగిని తీసుకెళ్లడానికి అంబులెన్స్ కూడా రాదు. డ్రైనేజీ వ్యవస్థ కుప్పకూలి, మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. వందల కుటుంబాలు ప్రాణాలను పణంగా పెట్టి ఈ భవనాల్లో ఉంటున్నాయి.

**కొనసాగుతున్న తాజా మాజీ నాయకుడి వసూళ్ల హవా!**

అక్రమ నిర్మాణాలకు అండగా ఉంటామని అవసరమైతే అనుమతులు లేకుండానే నిర్మాలు నిర్మాణాలకు అండగా ఉంటామని అంతేకాకుండా అనుమతులు చేయిస్తాం" అనే పేరుతో కొందరు తాజా, మాజీ నాయకులు వసూళ్ల దందా నడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మాకు అధికార పార్టీ నేతలతో సంబంధాలు ఉన్నాయి సంబంధిత అధికారుల అండ తో పాటు మీడియా సపోర్ట్ కూడా ఉంది, నన్ను ఎవరూ ఏమీ చేయలేరు" అని చెప్పి భయ పెడు తున్నారని కొంతమంది స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో అక్రమ నిర్మాణాలకు అడ్డుఅదుపు లేకుండా పోయింది.

**బల్దియా ఆదాయానికి భారీ గండి - పట్టించుకోని టౌన్ ప్లానింగ్**

ఈ అక్రమాల వల్ల బల్దియాకు రావాల్సిన బిల్డింగ్ పర్మిషన్ ఫీజు, డెవలప్‌మెంట్ చార్జీలు, ఇంపాక్ట్ ఫీజులు రావడం లేదు. కోట్ల రూపాయల ఆదాయం బల్దియాకు నష్టం కలుగుతుందని టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం "నోటీసులు ఇచ్చాం" అని చేతులు దులుపుకుంటున్నారు. కూల్చివేతలు మాత్రం ఉండవు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ఆస్తుల పరిరక్షణకు కఠినంగా ఉంటుంటే, మరోవైపు బల్దియా లోనే ఇలాంటి నిర్లక్ష్యం ఉండటం పై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల ఆవేదన.. డిమాండ్**

మేము చట్టబద్ధంగా ఇల్లు కట్టాలంటే లక్షలు ఫీజు కట్టాలి. వీళ్లు మాత్రం పదవులు అడ్డుపెట్టుకొని ఎటువంటి రూల్ లేకుండా కోట్లు సంపాదిస్తున్నారు. ఇదేం న్యాయం?" అని 28వ డివిజన్ నాయకుల తో పాటు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాల పై వెంటనే సర్వే చేసి, బాధ్యుల పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అక్రమ కట్టడాలను కూల్చి వేయాలని వారు జీడబ్ల్యూఎంసి కమిషనర్, జిల్లా కలెక్టర్ లకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# స్టైలిష్ లుక్‌తో మన్నారా చోప్రా



సాదాసీదా బ్యాక్‌డ్రాప్‌తో ఏర్పాటు చేసిన స్టూడియో ఫొటోషూట్‌లో బాలీవుడ్ నటి మన్నారా చోప్రా తన గ్లామర్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఒక చేతిని నడుముపై ఉంచి, భుజం మీదుగా కెమెరా వైపు చూస్తూ ఇచ్చిన పోజ్ ఆమె ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. తెలుపు రంగు కార్సెట్ శైలిలో రూపొందించిన క్రాప్‌టాప్‌పై గులాబీ రంగు పూల డిజైన్‌లు, భుజాల వద్ద టై స్ట్రాప్‌లు ఆమెకు మరింత స్టైలిష్ లుక్‌ను అందించాయి. లైట్ బ్లూ రిప్డ్ జీన్స్‌తో జత చేసిన ఈ దుస్తులు ఆధునిక ఫ్యాషన్‌కు నిదర్శనంగా నిలిచాయి. పెద్ద ముత్యాల హూప్ చెవిపోగులు, గులాబీ రంగు ఫిట్‌నెస్ బ్యాండ్ ఆమె స్టైల్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాయి. నల్లటి అలలలా వాలిన జుట్టులో కనిపించే లేత కారమెల్ హైలైట్స్ ఆమె అందాన్ని మరింత మెరుగుపరిచాయి.మన్నారా చోప్రా అసలు పేరు బార్బీ హండా. ఆమె భారతీయ సినీ నటి, మోడల్. ప్రముఖ నటి ప్రియాంక చోప్రాకు బంధువైన మన్నారా, 2014లో విడుదలైన తెలుగు రొమాంటిక్ కామెడీ చిత్రం 'ప్రేమ గీమ జంతా నై' ద్వారా సినీ రంగంలో అడుగుపెట్టారు. అదే ఏడాది హిందీలో విడుదలైన థ్రిల్లర్ చిత్రం 'జిద్'తో బాలీవుడ్ ప్రేక్షకులకు కూడా పరిచయమయ్యారు.

తెలుగు చిత్రసీమలో ఆమె 'జక్కన్న' (2016), 'తిక్క' (2016), 'రోగ్' (2017), 'సీత' (2019) వంటి చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. దక్షిణాది చిత్రాల్లో కథానాయికగా మాత్రమే కాకుండా, పలు ప్రత్యేక పాత్రలు, అతిథి పాత్రల్లోనూ కనిపిస్తూ ప్రేక్షకులను అలరించారు. తన అందం, చురుకైన నటనతో యువతలో మంచి అభిమానాన్ని సంపాదించుకున్నారు.2023లో ప్రసారమైన ప్రముఖ రియాలిటీ షో 'బిగ్‌బాస్ 17'లో పాల్గొన్న మన్నారా చోప్రా తన ఉత్సాహభరితమైన వ్యక్తిత్వం, నిజాయితీతో కూడిన ఆటతీరుతో దేశవ్యాప్తంగా విశేష ఆదరణ పొందారు. ఫైనల్ వరకు పోటీ పడి రన్నరప్‌గా నిలిచి తన ప్రజాదరణను మరింత పెంచుకున్నారు.ఇటీవలి కాలంలో టెలివిజన్ కార్యక్రమాలు, ఫొటోషూట్లు, బ్రాండ్ ప్రచార కార్యక్రమాలు, సామాజిక మాధ్యమాల్లో చురుకైన భాగస్వామ్యంతో అభిమానులకు ఎప్పటికప్పుడు చేరువవుతున్నారు. కొత్త సినిమా అవకాశాలను కూడా పరిశీలిస్తూ వినోద రంగంలో తన ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. గ్లామర్, ఆత్మవిశ్వాసం, స్టైలిష్ వ్యక్తిత్వంతో మన్నారా చోప్రా నేటి తరం ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన నటిగా నిలిచారు.

# అజయ్ భూపతి.. రెబల్ నుంచి దర్శకుడిగా..



వైవిధ్యమైన కథాంశాలు, బోల్డ్ ట్రీట్‌మెంట్, రా అండ్ రగ్గడ్ మేకింగ్‌తో తెలుగు చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు అజయ్ భూపతి. తొలి చిత్రం 'ఆర్ఎక్స్ 100'తో సంచలన విజయాన్ని అందుకున్న ఆయన, దర్శకుడిగా ఇండస్ట్రీ దృష్టిని ఒక్కసారిగా తనవైపు తిప్పుకున్నారు. ఆ తర్వాత 'మంగళవారం' వంటి విభిన్న చిత్రంతో మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. తెరపై ఎంత ఇంటెన్స్ కథలను ఆవిష్కరిస్తారో, నిజ జీవితంలోనూ ఆయన ప్రయాణం అంతే సవాళ్లతో, ఒడిదుడుకులతో సాగింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అజయ్ భూపతి తన చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. పాఠశాల రోజుల్లో తాను చాలా రెబల్ స్వభావంతో ఉండేవాడినని, పదో తరగతి చదువుతున్న సమయంలోనే తనకంటే పెద్దవారైన ఇంటర్మీడియట్ విద్యార్థులతో గొడవపడి వారిని చితకబాదిన సందర్భాలు కూడా ఉన్నాయని వెల్లడించారు. సాధారణంగా విద్యార్థులు తమతో సమానమైన వారితోనే తగాదాలు పడతారు. కానీ తన స్వభావం అలాంటిది కాదని ఆయన నవ్వుతూ గుర్తు చేసుకున్నారు. చదువుతో పాటు అన్యాయం జరిగినా, ఎవరికైనా ఇబ్బంది వచ్చినా ముందుండే వ్యక్తిగా తాను ఉండేవాడినని అజయ్ చెప్పారు. అలా గొడవలు, వివాదాలు, అల్లరితోనే తన జీవితంలోని తొలి 21 సంవత్సరాలు గడిచాయని తెలిపారు. ఊరిలో చేసిన అల్లరి చూసి తన భవిష్యత్తుపై చాలామంది సందేహాలు వ్యక్తం చేసేవారని, తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందేవారని పేర్కొన్నారు. అయితే వయసు పెరిగేకొద్దీ తన ఆలోచనల్లో పెద్ద మార్పు వచ్చిందని అజయ్ తెలిపారు. జీవితాన్ని సీరియస్‌గా తీసుకోవాలని నిర్ణయించుకుని, తనలోని ఆవేశాన్ని సృజనాత్మకతగా మలుచుకోవాలని భావించారన్నారు. సినిమాలపై ఉన్న మక్కువతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నానని చెప్పారు. దర్శకుడు రామ్ గోపాల్ వర్మ వద్ద పనిచేసిన అనుభవం తన కెరీర్‌కు ఎంతో ఉపయోగపడిందని అజయ్ భూపతి వెల్లడించారు. అక్కడ నేర్చుకున్న అనుభవం, జీవితంలో ఎదురైన సంఘటనలు, మనుషుల భావోద్వేగాలను తన సినిమాల్లో సహజంగా చూపించేందుకు తోడ్పడ్డాయని చెప్పారు. తన గత జీవితంలోని రెబల్ స్వభావమే 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి చిత్రాల్లో కనిపించే రా అండ్ రస్టిక్ పాత్రలకు మూలమని అభిప్రాయపడ్డారు. గొడవలు, అల్లరితో గడిచిన బాల్యం నుంచి విజయవంతమైన దర్శకుడిగా ఎదిగిన అజయ్ భూపతి ప్రయాణం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. జీవితంలో ఎదురయ్యే ప్రతి అనుభవం ఒక పాఠంగా తీసుకుని ముందుకు సాగితే ఏ రంగంలోనైనా విజయాన్ని అందుకోవచ్చని ఆయన జీవితం చెబుతోంది. కాగా, ఇటీవల అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కిన 'శ్రీనివాస మంగాపురం' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాతో సూపర్ స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ హీరోగా తెలుగు చిత్రసీమకు పరిచయమయ్యారు.



# కీర్తి సురేష్.. 41 గంటలు నిద్రలేక షూటింగ్

విభిన్న భాషల్లో వరుసగా సినిమాలు చేస్తూ బిజీగా గడుపుతున్న స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ తాజాగా తన కెరీర్‌లో ఎదురైన అత్యంత కఠినమైన అనుభవాన్ని వెల్లడించారు. ఒక ప్రాజెక్ట్ షూటింగ్ ముగిసిన వెంటనే మరో సినిమా సెట్స్‌కు వెళ్లాల్సిన పరిస్థితుల్లో విశ్రాంతికి కూడా సమయం దొరకలేదని, షెడ్యూల్స్ సర్దుబాటు చేయడం ఎంత కష్టమో వివరించారు. ఈ క్రమంలో ఏకంగా 41 గంటల పాటు కంటిమీద కునుకు లేకుండా షూటింగ్‌లలో పాల్గొన్న సందర్భం ఉందని చెప్పి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు.తన కెరీర్‌లో చాలా సందర్భాల్లో రోజుకు 12 గంటలకు మించి కూడా షూటింగ్‌లలో పాల్గొనాల్సి వచ్చిందని కీర్తి తెలిపారు. ఒక సినిమా నుంచి మరో సినిమా లొకేషన్‌కు ప్రయాణాలు చేస్తూ, రాత్రింబవళ్లు తేడా లేకుండా పని చేసిన రోజులు ఎన్నో ఉన్నాయని చెప్పారు. నటుడి జీవితం బయటకు కనిపించేంత సులభం కాదని, ప్రతి విజయానికి వెనుక ఎన్నో గంటల కష్టం, త్యాగం దాగి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. సినీ పరిశ్రమను బయట నుంచి చూసే వారికి అది గ్లామర్ ప్రపంచంలా కనిపించినా, తెర వెనుక నటీనటులు, సాంకేతిక నిపుణులు తీవ్రమైన మానసిక, శారీరక ఒత్తిడిని ఎదుర్కొంటారని కీర్తి వివరించారు. నిరంతరం ప్రయాణాలు చేయడం, వరుస షూటింగ్‌లు, నిద్రలేమి, సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని చెప్పారు. అయినప్పటికీ సినిమాలపై ఉన్న అంకితభావం, ప్రేక్షకుల ప్రేమే తనను ముందుకు నడిపిస్తున్నాయని ఆమె వెల్లడించారు. ప్రస్తుతం తెలుగు సినీ పరిశ్రమతో పాటు ఇతర భాషల చిత్ర పరిశ్రమల్లో కూడా నటీనటులు, సాంకేతిక నిపుణులకు రోజుకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తుండగా, కీర్తి సురేష్ చెప్పిన అనుభవం ఈ చర్చకు మరింత ప్రాధాన్యత తీసుకొచ్చింది. ఎక్కువ గంటలు పనిచేయడం వల్ల అలసటతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందనే అభిప్రాయానికి ఆమె వ్యాఖ్యలు బలం చేకూర్చుతున్నాయి. 'మహానటి' చిత్రానికి జాతీయ ఉత్తమ నటి అవార్డును అందుకుని దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్, ఈ స్థాయికి చేరుకోవడానికి ఎంతటి కఠినమైన శ్రమ, క్రమశిక్షణ, అంకితభావం అవసరమో ఈ ఘటన ద్వారా మరోసారి స్పష్టమైంది. విజయాల వెనుక కనిపించని కష్టం కూడా ఉంటుందని అభిమానులు సోషల్ మీడియాలో స్పందిస్తున్నారు. చిత్ర పరిశ్రమలో పని గంటల సంస్కరణలు, నటీనటుల ఆరోగ్య భద్రత, సమతుల్యమైన వర్కింగ్ అవర్స్‌పై జరుగుతున్న చర్చల మధ్య కీర్తి సురేష్ చేసిన ఈ వ్యాఖ్యలు విశేష ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రాబోయే రోజుల్లో సినీ పరిశ్రమ పని గంటల విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో, కళాకారుల ఆరోగ్యానికి ఎంత ప్రాధాన్యం ఇస్తుందో చూడాల్సి ఉంది.

# కిరణ్ అబ్బవరం.. కొత్త దారిలో కెరీర్

టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం కెరీర్‌ను పరిశీలిస్తే ఇటీవల ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. సినిమాల సంఖ్య కంటే ప్రాజెక్ట్‌ల ఎంపికలో అనుసరిస్తున్న వ్యూహమే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. వరుసగా కొత్త దర్శకులతో సినిమాలు చేయడం, సినిమా, వెబ్ సిరీస్‌లతో పాటు దర్శకత్వ బాధ్యతలను కూడా చేపట్టేందుకు సిద్ధమవడం ద్వారా కేవలం హీరోగానే కాకుండా క్రియేటివ్ వ్యక్తిత్వంగా తనను తాను నిలబెట్టుకోవాలని కిరణ్ ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది.సాధారణంగా విజయాల తర్వాత చాలా మంది హీరోలు పేరున్న దర్శకులతోనే సినిమాలు చేయడానికి ఆసక్తి చూపుతుంటారు. కానీ కిరణ్ అబ్బవరం మాత్రం కొత్త కథలు, కొత్త దర్శకులు, కొత్త తరహా ప్రయోగాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కమర్షియల్ పరంగా ఇది రిస్క్ అయినప్పటికీ, దీర్ఘకాలిక కెరీర్‌ను దృష్టిలో పెట్టుకుని తీసుకుంటున్న వ్యూహాత్మక నిర్ణయంగా సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల 'చెన్నై లవ్ స్టోరీ' విజయానంతరం స్వీయ దర్శకత్వంలో ఓ సినిమాను తెరకెక్కిస్తున్న కిరణ్, తాజాగా మరో కొత్త దర్శకుడికి కూడా అవకాశం ఇచ్చినట్లు సమాచారం.ప్రస్తుతం ఒకవైపు సినిమా షూటింగ్‌లు, మరోవైపు వెబ్ సిరీస్ కమిట్‌మెంట్‌లు, అలాగే దర్శకత్వ పనులను సమన్వయం చేస్తూ కిరణ్ ముందుకు సాగుతున్నారు. ఇది కేవలం బిజీ షెడ్యూల్ మాత్రమే కాదు. థియేటర్ ప్రేక్షకులతో పాటు ఓటీటీ ప్రేక్షకులను కూడా ఆకట్టుకోవడం, కథలపై మరింత క్రియేటివ్ కంట్రోల్ సాధించడం, భవిష్యత్తులో తన బ్రాండ్‌ను మరింత విస్తరించుకోవడం వంటి లక్ష్యాలు కూడా ఇందులో భాగంగా కనిపిస్తున్నాయి.కొత్త దర్శకులకు అవకాశాలు కల్పించడంపై కిరణ్ చూపిస్తున్న ఆసక్తి కూడా ప్రత్యేకంగా నిలుస్తోంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఎంతోమంది యువ దర్శకులు విభిన్న కథలతో ముందుకొస్తున్నప్పటికీ, గుర్తింపు ఉన్న హీరోల మద్దతు లభిస్తేనే వారి ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో కొత్త ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా ఇండస్ట్రీలో సృజనాత్మక వాతావరణాన్ని బలోపేతం చేసే ప్రయత్నం చేస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.అయితే ఈ తరహా వ్యూహంలో సవాళ్లు కూడా లేకపోలేదు. కొత్త దర్శకులతో పని చేయడం అంటే కథ అభివృద్ధి నుంచి చిత్రీకరణ వరకు అనేక అనిశ్చితులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అదే సమయంలో ఒకేసారి పలు ప్రాజెక్టులను నిర్వహించడం వల్ల సమయపాలన, పనిభారం, నాణ్యతను కాపాడుకోవడం వంటి అంశాలు కీలకంగా మారతాయి. అయినప్పటికీ కిరణ్ అబ్బవరం తీసుకుంటున్న నిర్ణయాలు చూస్తే, వరుస సినిమాలు చేయడం కంటే మంచి కథలను ప్రేక్షకులకు అందించడం, కొత్త దర్శకులకు అవకాశాలు కల్పించడం, థియేటర్‌తో పాటు ఓటీటీ రంగంలోనూ తన ప్రత్యేక గుర్తింపును మరింత బలోపేతం చేసుకోవడమే ఆయన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.ఈ వ్యూహం విజయవంతమైతే కిరణ్ అబ్బవరం కేవలం యువ హీరోగానే కాకుండా, నటుడు, దర్శకుడు, కంటెంట్‌ను ప్రాధాన్యంగా చూసే క్రియేటివ్ ఫిల్మ్‌మేకర్‌గా కూడా ప్రత్యేక గుర్తింపు సంపాదించే అవకాశం ఉందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com